## నిబంధనలు అతిక్రమించిన వ్యాపారస్తులకు రూ. 6 లక్షల జరిమానా


విచారణ జరుపుతున్న అదనపు కలెక్టర్ సంగీత

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 26, ప్రభాతవార్త :** నిబంధనలను అతిక్రమించిన 18 మంది వ్యాపారస్తులకు జిల్లా అదనపు కలెక్టర్ సంగీత శనివారం 6లక్షల 39 వేల రూపాయలు జరిమానా విధించారని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ తెలిపారు. తిరుమల డైరీకి 2 లక్షలు, కంకల్ సమీపమే వొక్సన్ యూనివర్సిటీలోని హాస్టల్ నిర్వాహకులకు ఒక లక్ష, బాలాజీ వనిత స్వీట్ హౌస్ కు 3వేలు, తహ అల్లం పేస్టు వారికి 25 వేలు పటాన్చెరు జిఎండి అల్లం పేస్టు వారికి 30 వేలు జరిమానా విధించడం జరిగిందని అన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త


## అక్రమ దుకాణాలకు నోటీసులు జారీ

**నార్సింగి, జూన్ 6, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో రోడ్ల పైన అక్రమంగా వెలిసిన దుకాణాలను మరియు ఎమ్మార్వో, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గ్రామపంచాయతీకి చెందిన స్థలంలో అక్రమంగా నిర్మించిన డబ్బాలను వెంటనే తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగభూషణం యజమానులకు నోటీసులు జారీ చేశారు. అక్రమంగా వేసిన డబ్బాల వలన వాహనదారులకు ప్రజలకు ఇబ్బంది కలిగేవిధంగా డబ్బాలు ఉన్నాయి. మూడు రోజులలో స్వచ్ఛందంగా డబ్బాలను తొలగించాలని పేర్కొన్నారు. లేనియెడల పంచాయతీ రాజు చట్టం 2018 సెక్షన్ 92 ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి అక్రమణాలకు పల్పడిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి నాగభూషణం హెచ్చరించారు.


దుకాణాలకు నోటీసులు అతికిస్తున్న పంచాయతీ సిబ్బంది


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

## నీట్ 2026 పరీక్ష పకడ్బందీగా నిర్వహిస్తాం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ వ్యాప్తంగా ఈనెల 21 నిర్వహించనున్న నీట్ 2026 పరీక్ష పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లు, అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 21 నీట్ 2026 పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ ఇతర శాఖ సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలును ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో 23 మండల సమైక్యలకు బస్సులను ఇవ్వడం జరిగిందని ఆయా బస్సులను 9న సిఎం ప్రారంభించేందుకు ఎస్‌హెచ్‌జి మహిళలతో కలిసి బస్సులను హైదరాబాద్‌కు పంపుతామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించేందుకు ప్రభుత్వం నుంచి క్లాత్ వచ్చిన వెంటనే స్టిచ్చింగ్ చేసేందుకు మండలాల వారిగా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జయచంద్ర రెడ్డి, డీఎస్‌ఓ తనూజ, డీఎం గోపికృష్ణ, డీటీఓ జోగేశ్వర్‌జాదవ్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్, జూన్ 6 (ప్రభాతవార్త) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం పోచారం అటవీ ప్రాంతంలో బర్డ్ వాక్(పక్షుల నడక) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అటవీ శాఖ అధికారి, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్య అధికారి, అడవులు సజీవంగా ఉండటానికి పక్షుల కిలకిలరావాలు ఎంతో ముఖ్యమని గుర్తుచేశారు. ఉదయాన్నే పక్షుల శబ్దాలు వినిపిస్తేనే ఆ అటవీ ప్రాంతం ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని కలిగి ఉందని అర్థమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో వాడుతున్న రసాయనాలు, పురుగు మందులు, పెరుగుతున్న కాలుష్యం, రేడియేషన్ కారణంగా రాబందులు వంటి ఎన్నో రకాల పక్షులు అంతరించిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని, పక్షులను కాపాడుకోవడానికి మొక్కలను నాటడం, అడవులను రక్షించడం ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత కేవలం సెల్‌ఫోన్లకే పరిమితం కాకుండా, ప్రకృతిని గమనించడానికి ఒక నోట్‌బుక్ పట్టుకుని పక్షులను గమనిస్తూ వాటి వివరాలను నమోదు చేస్తూ పక్షి ప్రేమికులుగా మారాలని సూచించారు. తెలంగాణ అడవుల్లో 200 నుండి 300 రకాల పక్షిజాతులు ఉన్నాయని, వాటిని కాపాడుకోవడం ద్వారానే మన పర్యావరణ వ్యవస్థ సమతుల్యంగా ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ బర్డ్స్ వాక్ కార్యక్రమం ఇక్కడితోనే ముగిసిపోకుండా, ప్రతి ఒక్కరూ ఇళ్లకు, ఆఫీసులకు, సమాజంలోకి వెళ్లినప్పుడు పర్యావరణ ప్రాముఖ్యతపై చర్చించాలని, అడవుల రక్షణకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## నేటి బాలలే.... రేపటి నాయకులు

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్

**పాపన్నపేట, జూన్ 6, ప్రభాతవార్త :** నేటి బాలలే రేపటి నాయకులని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు. శనివారం పాపన్నపేటలోని మంజీరాగార్డెన్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల పంచాయతీ కార్యక్రమానికి మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు ముఖ అతిథిలుగా హాజరై మాట్లాడారు. బాలల ఆలోచనలు, అభిప్రాయాలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని, చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, బాలల అభిప్రాయాలకు విలువనిస్తూ వారికి నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కల్పించడంద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగాతీర్చిదిద్దవచ్చన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, డీసీపీఓ నాగరాజు, సీసీఎస్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, సీఐడీ ఉమెన్ సేఫ్టీవింగ్ సీఐ రాజేష్, రూరల్ సీఐ జార్జ్, యంగిస్తాన్ ఫౌండేషన్ ప్రతినిధి రుత్విక, విజన్ ఎన్‌జీఓ ప్రతినిధులు రాజు, యాదగిరి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, పీఎంశ్రీ పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, సర్పంచ్ పావనినరేందర్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, నాయకులు శ్రీకాంత్ అప్ప, మాజీ సర్పంచ్ గురుమూర్తిగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు రాములు, కిష్టయ్య, నాయకులు శివయ్య, సంగమేష్, ప్రసాద్గౌడ్, ప్రవీణ్ గౌడ్, వివిధ గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం అన్‌లోడింగ్ పనులను వేగవంతం చేయాలి...

**నర్సాపూర్, జూన్ 6, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని షుగర్‌ఫ్యాక్టరీలో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఫ్యాక్టరీని సందర్శించి అన్‌లోడింగ్ పనులను చూశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌నాగేష్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం లారీలను ఆలస్యం చేయకుండా త్వరగా దిగుమతి చేయాలని అధికారులకు సూచించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తూకాల్లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని అధికారులను కోరారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన డిటివో, ఎంవిఐ

**సిద్దిపేట, జూన్ 6, ప్రభాతవార్త :** జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలుచేపట్టిన జోగేశ్వర్‌జాదవ్ శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హైమావతిని కలిసి పూలమొక్కను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో రవాణా శాఖను రాష్ట్రంలోనే ముందు వరసలో నిలిపేలా పని చేయాలని కలెక్టర్ హైమావతి సూచించారు. ఇక్కడ డిటిఓగా పనిచేసిన లక్ష్మణ్ మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో ఎంవిఐ శివ స్వప్న తదితరులు ఉన్నారు.


జిల్లా కలెక్టర్‌ను కలిసి పూల మొక్కను అందిస్తున్న డిటివో జోగేశ్వర్ జాదవ్, ఎంవిఐ శివ స్వప్న

# ఈవిఎంల భద్రతకు అధిక ప్రాధాన్యం

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి... సంగారెడ్డి ఈవిఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 6, ప్రభాతవార్త :** ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత, భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పాత డీఆర్డీఏ కార్యాలయంలో ఉన్న ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు) గోడౌన్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ టి.ఎల్.సంగీత పాల్గొన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలమేరకు గోడౌన్ సీళ్లను తెరిపించి, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. యంత్రాల భద్రత, నిల్వ విధానం, రికార్డుల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఈవో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సామాగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పని చేసేలా పర్యవేక్షించాలని, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.



ఈవిఎం గోడౌన్ తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

ఈవిఎంలు, ఇతర ఎన్నికల పరికరాల నిర్వహణలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈవీఎం గోడౌన్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, మాస, త్రైమాసిక తనిఖీలు క్రమంతప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జైరాం నాయక్, పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాజీ సిఎం కేసిఆర్ దంపతులను సన్మానిస్తున్న భూపాల్‌రెడ్డి

## మాజీ సిఎంను సన్మానించిన మాజీ ప్రొటెం స్పీకర్

**రామచంద్రాపురం, జూన్ 6, ప్రభాతవార్త:** 60వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ప్రొటెం స్పీకర్ వెన్నవరం భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. కేసిఆర్, కేసిఆర్ సతీమణి శోభలు భూపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి ధర్మపత్ని గీతలకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, భారతీ నగర్ డివిజన్ మాజీ కార్పోరేటస్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి, నయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనభేరి విగ్రహ పునః ప్రతిష్ఠాపనకు స్థల పరిశీలన

**హుస్నాబాద్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :** పట్టణంలో విప్లవ యోధుడు, ప్రజా నాయకుడు అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహ పునః ప్రతిష్ఠాపనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా శనివారం స్థల పరిశీలన చేపట్టారు. సిద్దిపేట జాతీయ రహదారి ఆర్టీసీ డిపో క్రాస్ రోడ్డు కూడలిలో విగ్రహాన్ని ఏర్పాటుచేయనున్న నేపథ్యంలో సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండీ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మున్సిపల్ అధికారులు పాల్గొని విగ్రహ స్థాపనకు అనువైన ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ సత్యనారాయణ, సీపీఐ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేష్, గూడ పద్మ, చాడా శ్రీధర్‌రెడ్డి, పొదిల కుమార స్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్, జంగా విజయ, గంబీరాపు మధు, అయిలేని మల్లారెడ్డి, రోళ్ల భాగ్య, నిర్మల పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు


మత్స్యకారులతో మాట్లాడుతున్న ఏడి

## మత్స్యశాఖ ఎడి న్యాయం చేయడం లేదు

### -కోర్టు ఆదేశాలు ఉన్నా అనుమతులు కరువు

**అల్లాదుర్గం, జూన్ 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడిపెద్దాపూర్ మత్స్య కార్మిక సంఘం వారికి చేపలు పట్టేందుకు జిల్లా మత్స్యశాఖ ఏడి ఫిషరీస్ న్యాయం చేయడం లేదని మత్స్యకార్మికులు ఆరోపించారు. శుక్రవారం చేపులు పట్టడానికి మత్స్యకారులు చెరువుకు వెళ్లగా అనుమతులు ఇచ్చిన ఏడి ఫిషరీస్ మళ్లా పెద్ద చెరువులో చేపలు పట్టవద్దని చెప్పడంతో గడిపెద్దాపూర్ మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్న తమకు సొసైటీ ఉన్నప్పటికి మత్స్యశాఖ జిల్లా అధికారులు తమకు సరైన న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గడిపెద్దాపూర్‌లో పెద్ద చెరువుఉలో చేపలు పట్టాలని మత్యశాఖ ఏడిని అదేశాలిచ్చి మరలా వద్దని చెప్పడం ఏంటని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులోని చేపలను నెలరోజుల కిందే పట్టాల్సి ఉండగా మత్స్యశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించి అనుమతులు పొందినా మత్స్యశాఖ తమ గ్రామంపై సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తూ గ్రామానికి పక్కగా ఉన్న కంసాన్‌పల్లి గ్రామస్థులకు వత్తాసు పలకడం తగదని ఆందోళన చెందుతున్నారు. పెద్ద చెరువులో చేపలు పట్టనివ్వకపోతుండటంతో చెరువులోని చేపలు మృత్యువాత పడుతున్నాయని, ఫలితంగా మత్స్యకారులకు జరిగిన ఆర్థిక నష్టాన్ని ఎవరు భరిస్తారని అధికారిని ప్రశ్నిస్తున్నారు. రెండు గ్రామాలు వేరు వేరు జిల్లాల్లో ఉండటంతో అర్హులైన వారికి న్యాయం జరగడంలేదని వాపోయారు. రెండు గ్రామల కార్మికులు చెరువు వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనకు ఆస్కారం లేకుండా అల్లాదుర్గం సిఐ రేణుక, ఎస్ఐ శంకర్‌లు పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ స్పందించి పెద్ద చెరువులో చేపలు పట్టుకునేలా అనుమతులు ఇచ్చేలా మత్స్యశాఖను ఆదేశించాలని మత్స్యకారులు వినతి చేస్తున్నారు.

## ట్రాక్టర్‌కు నిప్పు పెట్టిన దుండగులు

**వెల్దుర్తి, జూన్ 6, ప్రభాతవార్త :** మండలంలోని చేరిల గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్‌కు నిప్పుపెట్టి ధ్వంసం చేసిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. బాధితులు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రైతు సల్ల మహేష్ పొలం వద్ద ట్రాక్టర్‌ను నిలిపి ఇంటికి వెళ్లాడు. అదే అదునుగా గమనించిన దుండగులు రాత్రి ట్రాక్టర్‌కు నిప్పు పెట్టి దగ్ధం చేశారు. శనివారం ఉదయం చూసేసరికి ట్రాక్టర్ ఇంజన్ పూర్తిగా దగ్ధం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# సైబర్ నేరగాళ్ల వలలోపడి మోసపోతున్న ప్రజలు

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**కొండాపూర్ జూన్ 6 ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం గొల్లపల్లిలో నిర్వహిస్తున గ్రామసభలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గొల్లపల్లిలో నిర్వహిస్తున్న గ్రామ సభలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సైబర్ నేరాల గురించి వివరిస్తూ, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు వేసే వలలో అమాయక ప్రజలు మోసపోతున్నారని తెలిపారు. మొదట కొంత డబ్బు వచ్చినట్లు చూపించి, అనంతరం భారీ మొత్తాలు పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, తెలియని లింకులు లేదా ఏపీకే (APK) ఫైళ్లను ఓపెన్ చేసి మోసపోవద్దని సూచించారు. పార్సిల్ లేదా కొరియర్ పేరుతో కూడా మోసాలకు పాల్పడుతున్నారని, అత్యాశకు పోయి సైబర్ నేరాల బారిన పడవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా సైబర్ నేరాల బారిన పడుతున్న వారిలో విద్యావంతులే అధికంగా ఉన్నారని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని గ్రామ స్థాయిలో ప్రజలకు చైతన్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా మహిళల భద్రత కోసం భరోసా సెంటర్, షీటీమ్స్ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, పోక్సో,



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్

అత్యాచార కేసుల్లో భరోసా కేంద్రం పనితీరు, మహిళల రక్షణ కోసం షీటీమ్స్ అందిస్తున్న సేవలు, సైబర్ నేరాల నివారణ చర్యలు, అత్యవసర సేవల వినియోగం తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. పోలీసు స్టేషన్లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో బాధిత మహిళలకు అవసరమైన అన్ని రకాల మెడికోలీగల్ సేవలను అందిస్తూ, బాధిత మహిళల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు భరోసా కేంద్రం ద్వారా సహాయ సహకారాలు అందించడం జరుగుతోంది అన్నారు. మహిళలు పని ప్రదేశాల్లో గానీ, ఇతర ప్రాంతాల్లో గానీ ఎలాంటి సమస్యలను ఎదుర్కొన్నా వెంటనే జిల్లా షీటీమ్ నంబర్ 8712656772 లేదా ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181/ డయల్100కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రారంభించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ, నేరాలు జరిగిన తర్వాత వాటిని ఛేదించడానికే కాకుండా, నేరాలను ముందుగానే నివారించడంలో కూడా సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిఎస్పీ సత్యయ్య, గౌడ్, డిప్యూటీ సిఇఓ స్వప్న, తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో సౌమ్యశ్రీ, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


ఘర్షణకు దిగిన ఇరువర్గాల నాయకులు

## గ్రామసభలో అధికారుల ముందే బాహాబాహి

### పోలీసుల జోక్యంతో శాంతించిన ఇరువర్గాలు

**మనోహరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మనోహరాబాద్‌లో శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్ కౌశిక్‌రెడ్డి హాజరుకాగా సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్‌యాదవ్ అధ్యక్షతన కార్యదర్శి రూపగౌడ్ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ ప్రారంభం కాగానే గతంలో చేసిన తీర్మానాలు ఏ ఒక్కటీ అమలు కాలేదని చేసిన తీర్మానాలే అమలు కాకపోతే గ్రామసభలు ఎందుకని ప్రజలు తెలిపారు. ఇప్పటికే స్కూలుకు వెళ్లే దారి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే మండల కేంద్రంలో దుకాణాల ముందు వాహనాలు నిలపడంతో బస్సు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనాలను తీసే విధంగా దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. గ్రామసభలకు ఇరిగేషన్ శాఖ నుండి ఏఈ, విద్యుత్ శాఖ ఏఈలు రాకపోవడంతో గ్రామస్తులు ఎందుకు రాలేదంటూ ప్రశ్నించారు. దీంతో స్పెషల్ ఆఫీసర్ కౌశికరెడ్డి ఏఈలకు నోటీసులు ఇవ్వాలని కార్యదర్శికి సూచించారు. గ్రామసభ కొనసాగుతుండగానే సర్పంచ్‌కు వ్యతిరేకవర్గం సభకు వచ్చి గ్రామసభలో చర్చించాల్సిన సమస్యలను పక్కదారి పట్టించి కేవలం సర్పంచ్‌ను టార్గెట్ చేస్తూ ఎన్నికలకు ముందు మీరు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చడం లేదని పెద్దఎత్తున వాగ్వాదానికి దిగారు. దాంతో సర్పంచ్ అనూష భాస్కర్‌యాదవ్ తాము చేయాల్సిన హామీల అమలును చేస్తూనే ఉన్నామని చేసిన వాటిని ప్రతిదీ తెలపలేమని హామీలు అమలు చేస్తున్నామో లేదో తెలుసుకొని మాట్లాడాలని జవాబిచ్చారు. మరి కొంత మంది సర్పంచ్‌గా ఎన్నికై ఐదు నెలలకి ఇచ్చిన హామీలన్నీ ఎలా నెరవేరుస్తారు అంటూ సర్పంచ్ వర్గం వ్యతిరేకవర్గంతో వాగ్వాదానికి దిగారు. దాంతో ఇరు వర్గాల మధ్య పెద్దఎత్తున మాటల యుద్ధం నెలకొంది. ఇరువార్గాలు ఒకరికొకరు నువ్వు ఎంత అంటే నువ్వు ఎంత అనే విధంగా బాహాబాహికి దిగే పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు గ్రామసభలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదాల నెలకొనడంతో వారు ఏం జరుగుతుందో అని నిశ్చేష్టులై ఉండిపోయారు. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం అధికారులు గ్రామ సభను ముగించారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్, ఉపసర్పంచ్ వెంకటరెడ్డి తోపాటు వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

**రామాయంపేట, జూన్ 6, ప్రభాతవార్త :** విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఓ యువ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. కుటీంబీకులు, పోలీసులు కథనం ప్రకారం... మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన సంగం మహిపాల్(28) శివంపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామం కోమటిపల్లికి బయలు దేరిన మహిపాల్, రామాయంపేట శివారులో మెదక్ వెళ్తున్న లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య అనితతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శనివారం కోమటిపల్లిలో మహిపాల్ అంత్యక్రియలు పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. కానిస్టేబుల్ అంత్యక్రియలలో మెదక్‌జిల్లా అడిషనల్‌ఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ హాజరై, నివాళులర్పించారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. కాపర్ వైర్ చోరీ

**వెల్దుర్తి, జూన్ 6, ప్రభాతవార్త :** మండలంలోని అస్సాల్పూర్ గ్రామ శివారులో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు. మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లి శివారులో మూడు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసంచేసి అందులో ఉండే విలువైన రాగి, కాపర్ వైర్, ఆయిల్‌ను దొంగలించకు వెళ్లారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరగగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన రైతులు అధికారులకు సమాచారం అందించారు. రైతుల ప్రియాకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## ధాన్యం లోడుతో పరారైన డ్రైవర్ అరెస్ట్

**వర్గల్, జూన్ 6 (ప్రభాతవార్త):** వడ్ల లోడుతో రాజస్థాన్‌కు పరారైన డిసిఎం డ్రైవర్‌ను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ ఏసిపి నరసింహులు తెలిపారు. శనివారం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏసిపి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుకునూరుపల్లి మండలం తిప్పారం, రవీంద్రనగర్ గ్రామాలకు చెందిన 8 మంది రైతుల నుండి సేకరించిన 491 బస్తాల (196 క్వింటాళ్ల) వరి ధాన్యంను గత నెల 28వ తేదీన డిసిఎం వాహనంలో వర్గల్‌లోని మహాదేవ్ ఆగ్రో ఇండస్ట్రీ రైస్‌మిల్లుకు రాత్రి 7.30 గంటలకు తరలించడం జరిగిందని తెలిపారు. డిసిఎంలో వచ్చిన రైతులు వాహనంను రైస్‌మిల్లులోకి పంపమని భద్రతా సిబ్బందిని కోరగా, వారు నిరాకరించి పార్కింగ్ ప్రదేశంలో వరుసలో నిలిపివేయాలని సూచించడంతో డిసిఎంను వరుసలో పెట్టారని తెలిపారు. అనంతరం రైతులు తమ గ్రామానికి వెళ్ళిపోగా 29వ తేదీన ఉదయం రైతులు తిరిగి రైస్‌మిల్లుకు వచ్చే సరికి డిసిఎం వాహనం, డ్రైవర్ దశరథ్‌సింగ్ కనిపించలేదు. పార్కింగ్ ప్రదేశంలో ఉన్న ఇతర వాహనాల డ్రైవర్లను విచారించగా మరో డిసిఎం డ్రైవర్ లాహోర్ వెంకటేష్ నిందితుడు అయిన దశరథ్‌సింగ్ డిసిఎం వాహనంను పర్కింగ్ ప్రదేశం నుంచి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో రైతులు గౌరారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు ఏసిపి నర్సింహులు పర్యవేక్షణలో గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు, గౌరారం ఎస్ఐ ఆరోగ్యం, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ నేతృత్వంలో కానిస్టేబుళ్ల మహేష్, రంజిత్‌లతో రెండు ప్రత్యేక బృందాలుగా రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు పట్టణానికి చేరుకొని నిందితుడు దశరత్‌సింగ్‌తో పాటు ధాన్యం లోడుతో ఉన్న డిసిఎం వాహనాన్ని గౌరారంకు తీసుకువచ్చినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితుడు దశరథ్‌సింగ్‌ను గజ్వేల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసును ఛేధించిన సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అభినందాచరని ఏసిపి నరసింహులు పేర్కొన్నారు.


నిందితుని వివరాలు తెలుపుతున్న పోలీసులు

## సాంకేతికత బదిలీతో విస్తరణమైన ఉపాధి అవకాశాలు

**- పినాంగ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం జగ్‌దీప్ సింగ్**

**జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్త:**

ఆధునికి సాంకేతికలను ఇచ్చిపుచ్చుకోవడం వల్ల ఎంతో మందికి విద్యా, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మలేషియాలోని పినాంగ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం జగ్‌దీప్ సింగ్ డీఈవో అన్నారు. బంజారాహిల్స్‌లోని ది లీలా హోటల్‌లో బైకస్, వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, హెల్త్‌కేర్ ట్రయాంగిల్ సంస్థలతో సాంకేతిక మార్పిడి తదితర అంశాలపై ఆయన అవగాహన పరస్పర అవగాహన ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందాల వల్ల పినాంగ్‌లో భారతీయ యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అదే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ అధునాతన సాంకేతికతలలో పరస్పర సహకారం ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇప్పటికీ ప్రాంతీయ ఇన్నోవేషన్ హబ్‌గా పినాంగ్‌కు పేరుందని ఈ ఒప్పందాలతో అది మరింత బలోపేతం అవుతుందన్నారు. పినాంగ్‌లో అభివృద్ధి చెందుతున్న వైద్య పర్యాటక రంగానికి హెల్త్ కేర్ ఐటీ ఎలక్ట్రానికల్ మెడికల్ రికార్డులు, డిజిటల్ హెల్త్‌సొల్యూషన్స్ సహకారం వల్ల హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ కంపెనీలు తమ వ్యాపారాలను సులభంగా పినాంగ్‌లో విస్తరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉమ్మడి పరిశోధనలు, ఇన్నోవేషన్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బైకస్ సంస్థ ప్రతినిధి డాక్టర్ నాగేశ్వర్‌రావు పులిపాటి, వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రతినిధి డాక్టర్ విజయేందర్‌రెడ్డి, హెల్త్‌కేర్ ట్రయాంగిల్ చైర్మన్ సురేష్ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## దినేష్ కుమార్‌కు కెఎస్ఆర్ అభినందనలు

**నిజాంపేట్, జూన్ 6, ప్రభాతవార్త**

హైదరాబాదులో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కీబోర్డ్ సంగీత కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన యువ వాయిద్యకారుడు కవి గారి దినేష్ కుమార్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన సుమారు 2000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొన్నారు. గంటపాటు ఎలాంటి విరామం లేకుండా కీబోర్డ్ వాయిస్తూ తమ సంగీత ప్రతిభను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అత్యుత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన 777 మంది వాయిద్యకారులను నిర్వాహకులు ఎంపిక చేయగా, వారిలో దినేష్ కుమార్ కూడా స్థానం సంపాదించడం విశేషం. ఈ సందర్భంగా దినేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని శనివారం కలిసి వారి ఆశీస్సులు పొందారు. దినేష్ కుమార్ సాధించిన ఈ ఘనతపై కెఎస్ఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుకుని గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌కు ఎంపిక కావడం ఎంతో గర్వకార ణమని, యువత తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. దినేష్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. అతనికి నా పూర్తి సహకారం, ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

## వట్టే జానయ్య యాదవ్‌ను పరామర్శించిన
## యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు



**సంజీవరెడ్డి నగర్, జూన్ 6, ప్రభాతవార్త:**

సూర్యాపేటలో నిర్వహించిన ధర్నా కార్యక్రమం సందర్భంగా టీఆర్‌పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో ఆయన అస్వస్థతకు గురై ప్రస్తుతం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిగె శ్రీనివాస్ యాదవ్ శనివారం ఆసుపత్రికి వెళ్లి జానయ్య యాదవ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు, త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న నాయకులపై అనవసర చర్యలు తీసుకోవడం సమంజసం కాదని వారు అభిప్రాయపడ్డారు. వట్టే జానయ్య యాదవ్ సమాజ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్న నాయకులు, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజల కోసం సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయ యాదవ హక్కుల పోరాట సమితికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు.

## హైడ్రాపై బిఆర్ఎస్ నేత ఆగ్రహం

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** హైడ్రా కమీషనర్ ఎ.వి.రంగనాథ్ వ్యవహారశైలిపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అంబర్‌పేటలో విలేఖరులతో మాట్లాడుతూ తనకు సంబంధించిన ఖుష్కీ (పొడి) భూమిలో హైడ్రా అధికారులు అక్రమంగా ప్రవేశించి, బతుకమ్మకుంట పేరుతో కృత్రిమ చెరువును సృష్టించారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన శికం భూమి విషయంలో మాత్రం మినహాయింపులు ఇచ్చి, వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తన భూమి వ్యవహారంలో సుప్రీంకోర్టు ధిక్కరణ అంశం ఉన్నప్పటికీ, కమీషనర్ రంగనాథ్ న్యాయస్థాన ఆదేశాలను పట్టించుకోవటం లేదని, కేంద్రహోం శాఖకు చెందిన ప్రజా ఫిర్యాదుల వేదిక (సిపిగ్రామ్స్) ద్వారా చేసిన ఫిర్యాదులను సైతం ఆయన తేలికగా తీసుకోవటం ఆశ్చర్యకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యవస్థల పట్ల గౌరవం చూపాల్సిన ఆల్ ఇండియా సర్వీస్ అధికారిగా రంగనాథ్ వ్యవహారం సరికాదని తెలిపారు. హైడ్రా కమీషనర్‌పై తాను చేసిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## కళల వికాసానికి ఎస్పీభారతి కృషి అనిర్వచనీయం




**రవీంద్రభారతి, జూన్ 6 ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతి, సంప్రదాయ సంగీత నృత్యకళల వికాసానికి డా. ఎస్.పి.భారతి చేస్తున్న సేవ, కృషి అనితరసాధ్యమని వక్తలు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదిక పెండ్యాల నృత్యభారతి అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డా. ఎస్.పి.భారతి మాట్లాడుతూ గత 3 దశాబ్దాలుగా ప్రతీయేడాది 30రోజులపాటు వేసవిలో నృత్యశిక్షణా తరగతులు నిర్విరామంగా నిర్వహిస్తూ నృత్యకళలో ఆసక్తివున్న చిన్నారులను నృత్యకళాకారులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ ముగింపు సాంస్కృతిక కార్యక్రమంలో 90మంది విద్యార్థులు 90 నిముషాలపాటు పలు అంశాలతో కూచిపూడి నృత్యప్రదర్శన కావించి ఆహుతులను తన్మయుల్ని చేశారు. సంస్కారభారతి వర్కింగ్ ప్రెసిడెంట్ డా. కెకెవి. శర్మ, దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ డా. రేవూరి అనంతపద్మనాభరావు, తెలుగు విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ సుదర్శన్‌సింగ్, కళాపోషకులు తడకమళ్ల రామచంద్రరావు, నాట్యగురువు పి.రమాదేవి, సంగీత దర్శకుడు రమణమూర్తి, మనోజ్‌కుమార్ పాల్గొని డా, ఎస్పీభారతిని సత్కరించారు.

## బివిఆర్ఐటీ కళాశాలను సందర్శించిన హిరోషిమా ప్రతినిధి బృందం

**నిజాంపేట్, జూన్ 6, ప్రభాతవార్త**



భారత్, జపాన్ మధ్య విద్యా, పరిశోధన, సాంస్కృతిక మరియు పారిశ్రామిక రంగాల సహకారాన్ని మరింత విస్తరించే దిశగా జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రభుత్వానికి చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం బీవీఆర్ఐటీ హైదరాబాద్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించింది. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కళాశాలలోని విష్ణు జపాన్ అవుట్‌రీచ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఈ బృందానికి ఘన స్వాగతం పలికారు. ప్రతినిధి బృందంలో ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్ డైరెక్టర్ ఫునైషి హిరోయోషి, కోగా యుయా, హరాజోనో యోషిహిరో, టోయి మారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణు జపాన్ అవుట్‌రీచ్ సెంటర్ ద్వారా అమలు చేస్తున్న ఇండో, జపాన్ విద్యా కార్యక్రమాలు, జపనీస్ భాషా శిక్షణ, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి పథకాలు, జపాన్‌లో ఇంటర్న్‌షిప్‌లు, ఉన్నత విద్య అవకాశాలు, సంయుక్త పరిశోధనలు మరియు జపాన్ విశ్వవిద్యాలయాలతో ఉన్న భాగస్వామ్యాలపై సమగ్ర వివరాలు అందించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమైన ప్రతినిధి బృందం, భారతదేశం, జపాన్ మధ్య విద్యా, సాంకేతిక సంబంధాలను బలోపేతం చేయడంలో బీవీఆర్ఐటీ చేస్తున్న కృషిని అభినందించింది. అంతర్జాతీయ స్థాయి అవకాశాలను విద్యార్థులకు అందిస్తూ, ప్రపంచ స్థాయి నైపుణ్యాలను పెంపొందించే దిశగా కళాశాల చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించింది. ఈకార్యక్రమంలో బీవీఆర్ఐటీ హైదరాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, బీవీఆర్ఐటీ నర్సాపూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబె, నా రా జపాన్ హబ్ డాక్టర్ రామ భద్ర, పరిశోధన అభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ రాజు ఏడ్ల, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, జపనీస్ భాషా ఉపాధ్యాయులు టగూచి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. హిరోషిమా ప్రిఫెక్చర్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య అభివృద్ధి చెందుతున్న సంబంధాలకు ఈ సందర్శన మరో కీలక మైలురాయిగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు ప్రపంచ స్థాయి అవకాశాలు అందడమే కాకుండా, భారత్, జపాన్ ప్రజల మధ్య స్నేహబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కంటి గవ్వ మార్గం ద్వారా మెదడు కణితి తొలగింపు...నిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

**జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్త:**



లతతో నిమ్స్ శస్త్ర చికిత్స వైద్య బృందం

నిమ్స్‌లో మరో అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. నిమ్స్ వైద్యులు అత్యాధునిక ఎండోస్కోపిక్ ట్రాన్స్ఆర్బిటల్ అప్రోచ్ పద్ధతిలో కంటి గవ్వ మార్గం ద్వారా మెదడు కణితిని విజయవంతంగా తొలగించి ఈ ఘనతను సాధించారు. మెదక్ జిల్లా మధుర్ గ్రామానికి చెందిన మంగలి లత(50) తీవ్రమైన తలనొప్పితో నిమ్స్‌ను ఆశ్రయించారు. వైద్య పరీక్షల్లో భాగంగా కంటి వెనుక భాగంలోని పుర్రె అడుగు ప్రాంతంలో మెదడు కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ కణితులకు క్రానియోటమీ శస్త్రచికిత్స అవసరమవుతుండగా, నిమ్స్ వైద్యులు కంటి గవ్వ సహజ మార్గాన్ని ఉపయోగించి చిన్న కోతతో ఎండోస్కోపిక్ విధానంలో కణితిని పూర్తిగా తొలగించారు. శస్త్రచికిత్సలో 3డీ న్యూరోనావిగేషన్, సియుఎస్ఏ తదితర అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించారు. దీంతో మెదడు కణజాలానికి తక్కువ నష్టం కలగడంతో పాటు రక్తస్రావం, ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గి రోగి వేగంగా కోలుకున్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ, శస్త్రచికిత్స అనంతర పరీక్షల్లో కణితి పూర్తిగా తొలగించబడినట్లు నిర్ధారణ అయిందని, రోగి ఎటువంటి న్యూరోలాజికల్ సమస్యలు లేకుండా ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల కింద ఈ చికిత్సను పూర్తిగా ఉచితంగా అందించామన్నారు. ఈ శస్త్రచికిత్సను న్యూరోసర్జరీ విభాగ హెచ్‌వోడీ డా. వై. వంశీకృష్ణ నేతృత్వంలోని బృందం విజయవంతంగా నిర్వహించిందన్నారు. ప్రముఖ న్యూరోసర్జరీ కేంద్రాల్లో ఒకటైన నిమ్స్‌లో ప్రతి సంవత్సరం 3,500కు పైగా మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

## వడ్డెరలకు ప్రభుత్వ పనుల్లో 15 శాతం అమలు చేయాలి

**హైదరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త**



చైర్మన్ గుంజ రేణుక నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతలు సంపంగి రమేష్, గండికోట శ్రీనివాస్ తదితరులు

రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ఉన్న వద్దెరులకు ప్రభుత్వ పనుల్లో 15శాతం రిజర్వేషన్‌ను తిరిగి అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక నారాయణను శనివారం తెలంగాణ రాష్ట్ర వడ్డెర కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపంగి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండికోట శ్రీనివాస్ తదితరులు కలసి వినతిపత్రం అందజేశారు. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర వడ్డెర కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన గుంజ రేణుక నారాయణను ఎల్బీనగర్ చింతలకుంటలోని ఆమె నివాసంలో కలసి శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించి అభినందించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆ తరువాత టీడీపీ ప్రభుత్వాలు వడ్డెరులకు ప్రభుత్వ పనుల్లో వడ్డెరులకు 15 రిజర్వేషన్లను అమలు చేసారని, బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 15 రిజర్వేషన్‌ను 3కు తగ్గించిందని, దీంతో వడ్డెరులు తీవ్రంగా నష్టపోయారని సంపంగి రమేష్ వివరించారు. 2014 ముందు ఏవిధంగానైతే రిజర్వేషన్ అమల్లో ఉండెనో, అదేవిదంగా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వద్దురులకు 15 రిజర్వేషన్ అమలు చేయాలనీ, అలాగే మైనింగ్‌లో గతంలో 20శాతం ఉన్న దానిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 శాతానికి కుదించిందని, దీనిని కూడ గతంలో మాదిరి 20శాతానికి అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి అమలు చేయించి వడ్డెరుల అభివృద్ధికి తోడ్పడాలని సంపంగి రమేష్ కోరారు. గుంజ రేణుక నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పనుల్లో 15, మైనింగ్ పనుల్లో 20 రేజర్వేషన్లను వడ్డెరులకు గతంలో మాదిరి అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గనుల శాఖ మంత్రి జి.వివేక్, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు దండగుల రాజు, ఓర్సు వెంకటేశ్వర్లు, గండికోట ఆనంద్ కుమార్, రేపన్ గిరిబాబు, బోదాసు శేఖర్, శివరాత్రి కొమరమల్లు ఓర్సు యాదగిరి, ముద్దంగుల నరసింహ, గండికోట లక్ష్మీనారాయణ, గండికోట జంగయ్య, శివరాత్రి ఎంకన్న, పల్లపు బిక్షం, బొంత యాదగిరి పాల్గొన్నారు.

## నూతన బోధనా విధానాలపై అధ్యాపకులకు అవగాహన

**చిక్కడపల్లి జూన్ 6,ప్రభాతవార్త :** బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల్లో శనివారం నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అధ్యాపకులలో పరివర్తనాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు చక్కని వేదికగా నిలిచింది. విద్యా రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం, కృత్రిమ మేధస్సు (ఏ ఐ) ప్రాముఖ్యత మరియు బోధనలో నూతన విధానాలపై ఈ కార్యక్రమం ప్రధానంగా దృష్టి సారించింది. విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగంలో సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాలను ప్రస్తావించారు. 2026-27 విద్యా సంవత్సరానికి రూపొందించిన క్రమబద్ధమైన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని ఆయన పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాణ సంస్థ సీనియర్ ఫ్యాకల్టీ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థలో కృత్రిమ మేధస్సు (ఏ ఐ) ప్రాముఖ్యత, ప్రాంప్ట్ ఇంజినీరింగ్ సాంకేతికతలను వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ కృష్ణశర్మ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐ టూల్స్‌కు సంబంధించి తమకున్న పలు సందేహాలను అధ్యాపకులు నివృత్తి చేసుకున్నారు. విద్యా రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ లింబాద్రి సీనియర్ ఫాకల్టీ

## హిందీ అనువాదంతో దాశరథీ శతకానికి దేశవ్యాప్త ప్రచారం



భక్త రామదాసు విరచిత దాశరథి శతకాన్నితెలుగు అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి జూన్ 6 ప్రభాతవార్త :** భక్త రామదాసుగా ప్రసిద్ధి పొందిన కంచర్ల గోపన్న రచించిన దాశరథీ శతకం హిందీ భాషలోకి అనువా దం కావడంతో, ఇకపై ఇది తెలుగువారికే కాకుండా దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వస్తుందని భక్త రామదాసు వంశస్థులు కె. రమణ ఆకాంక్షించారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ సౌజన్యంతో, సంగీత నాట్య కళా వేదికపై భక్త రామదాసు విరచిత దాశరథి శతకాన్ని డాక్టర్ లక్ష్మణాచార్యులు, పద్మశ్రీ సంయుక్తంగా హిందీలోకి అనువాదం చేయగా, ఆ సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా కె. రమణ పుస్తక సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు భాషకే సొంతమైన విశిష్ట పద్య ప్రక్రియను, ఏమాత్రం అర్థం చెడకుండా హిందీ భాషలోకి అత్యంత అర్థవంతంగా అనువాదం చేసి దేశమంతటికీ పరిచయం చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జయరాములు మాట్లాడుతూ దాశరథీ శతక పద్యాలలోని అంతరార్థాలను, భక్తి భావాన్ని ఉదాహరణలతో సహా వివరించారు. ఈ వేదికపై ప్రముఖులు కన్నన్, డాక్టర్ విజయ రాఘవాచార్య, డాక్టర్ రామానుజాచార్యులు, పరమేశ్వర తదితరులు పాల్గొనగా.. డాక్టర్ విజయసారధి, డాక్టర్ సుజాత కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు. కాగా, పుస్తకావిష్కరణకు ముందు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన గాయక కవి సమ్మేళనం సదస్యులను విశేషంగా ఆకట్టుకుంది.

## గంజాయి విక్రేత అరెస్ట్

**తార్నాక, జూన్ 6 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 855 గ్రాముల గంజాయి, డిజిటల్ వెయింగ్ మెషిన్, శామ్‌సంగ్ గెలాక్సీ మొబైల్ ఫోన్, గంజాయి ప్యాకింగ్‌కు ఉపయోగించే 20 పరికరాలు, రవాణాకు వినియోగించిన బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం. ఏపీ. ప్రకాషం జిల్లా నర్వా గ్రామానికి చెందిన కాకాని నరేంద్ర (27), నడరంలోని బోడుప్పల్లో నివాసముంటూ రాపిడో ఫుడ్ డెలివరి బాయిగా పనిచేస్తున్నారు. కాగా ఇతను ఆంధ్రప్రదేశ్‌లోని సరఫరాదారుల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక లాభాల కోసం విక్రయిస్తున్నాడు. ఈ కేసులో పరారీలో ఉన్న ఏ2 నిందితుడు పి. మహేష్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సేకరణతో పా టు మరికొందరు సాక్షులను విచారిస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ కె. రక్షిత మూర్తి, అదనపు డీసీపీ జే. నర్సయ్య, ఉస్మానియా యూనివర్సిటీ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. జగన్ పర్యవేక్షణ లో ఇన్‌స్పెక్టర్ మహేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లెనిన్ బాబు, ఎస్ఐలు, క్లూస్ టీమ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.

## రోడ్డుపై పేరుకుపోయిన చెత్త.. అధికారుల పనితీరుకు నిలువుటద్దం..

**నిజాంపేట్, జూన్ 6, ప్రభాతవార్త**



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు.. అన్నట్లుగా ఉంది నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ అధికారుల వ్యవహారశైలి. అసలే నిజాంపేటలోని డంపింగ్ యార్డుతో నానా తంటాలు పడుతుంటే.. ఇక రోడ్డు కూడా డంపింగ్ యార్డుగా మారిపోయి అధికారుల పనితీరుకు నిలువుటద్దంగా నిలుస్తోంది. ఎంతగా అంటే రోడ్డు కూడా డంపింగ్ యార్డులో వచ్చేసిందా? అన్న రీతిలో చెత్త పేరుకుపోయి ఆ మార్గంలో వెళ్లేవారికి ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తోంది. రోడ్డు పొడవునా సగ భాగానికి పైగా చెత్త పేరుకుపోయి రాకపోకలకు చుక్కలు చూపిస్తోంది. ఇప్పుడు ఆ రోడ్డంటే వాహనదారులు భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. నిజాంపేట వాటర్ ట్యాంక్ నుంచి జర్నలిస్ట్ కాలనీ మీదుగా బాచుపల్లి గండిమైసమ్మ రహదారికి వెళ్లే మార్గం ఇప్పుడు వాహనదారులకు నరకం అంటే ఏమిటో పరిచయం చేస్తోంది. ప్రముఖ విద్యా సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీతో పాటు డబుల్ బెడ్రూమ్, రాజీవ్ గృహకల్ప.. ఇలా ఎన్నో కాలనీలు, బస్తీలకు వెళ్లేందుకు ఈ మార్గం ఎంతో సుగమం అన్నది అక్షరాల నిజం. అయితే ఈ రహదారిలో రెండుచోట్ల వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఆనుకునే ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్ద ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తతో ఒక సమస్య అయితే, రోడ్డు ప్రవేశద్వారం సమీపంలో శ్రీరామకుంట చెరువును ఆనుకుని డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా తవ్వేసిన రోడ్డు మరో కారణం. ఈ రెండుచోట్ల పడరాని కష్టాలను వాహనదారులు అనుభవిస్తున్నారు. ట్రాఫిక్ స్తంభించిపోయి కిలోమీటర్ల మేర వాహనదారులు నిలిచిపోయే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఎందుకొచ్చాం..రా ఈ రోడ్డులోకి అంటూ వాహనదారులు అసహనానికి గురయ్యే పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. ఒకవైపు డంపింగ్ యార్డును తరలించాలనే ఎన్నో ఏళ్లుగా డిమాండ్ వెల్లువెత్తుతున్నా.. డంపింగ్ యార్డును తొలగించడం మాట అటుంచితే ప్రధాన రోడ్డును కూడా చెత్తతో నింపేయడం వాహనదారుల ఆగ్రహానికి గురిచేస్తోంది. ప్రతిరోజూ పరిస్థితి ఇలాగే ఉంటుండడంతో ఆ మార్గంలో వెళ్లేవారు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి. మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఒకవేళ చూసినా ఆ ఏముందిలే.. ఇబ్బందులు పడేది జనమే కదా..? మనం కాదులే అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరోజు కాకపోతే మరోక రోజైనా రోడ్డుపై చెత్తను తరలించి రాకపోకలను సుగమం చేస్తారనుకుంటే కనీసం అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు దుమ్మెత్తిపోస్తున్నారు. ప్రతిరోజూ ఆ మార్గంలో వెళ్లేవారికి దుర్వాసనతో ముక్కుపుటాలు అదిరే బాధ ఒకటైతే.. రోడ్డుపై అడ్డగోలుగా పడేసిన చెత్త బాధ మరొకటి.. వెరసి వాహనదారులు, స్థానికులు అవస్థల అన్నీ ఇన్నీ కావు. ఒక మరోవైపు ఈ రోడ్డులోనే శ్రీరామకుంట చెరువు వద్ద జరుగుతున్న డ్రైనేజీ పైప్లైన్ల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో అక్కడ కూడా వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రధానమైన ఈ రోడ్డులో నెలకొన్న సమస్యలను పట్టించుకుని రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

## పవన్ కళ్యాణ్ మాటలను వక్రీకరిస్తున్నారు : ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్

**జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్త:**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాగర్ తదితర జనసేన నేతలు.

జనసేన అధినేత, ఏపి డిసిఎం పవన్‌కళ్యాణ్ మాటలను రాజకీయ నాయకులు వక్రీకరిస్తున్నారని ఆ పార్టీ ప్రచార కార్యదర్శి సాగర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ నీ అయ్య జాగిరా అని పవన్ కళ్యాణ్ మాట్లాడింది రాజకీయ నాయకులను ఉద్దేశించి అన్నారు. ఆ మాటలను కావాలని ప్రజలకు ఆపాదించి రాజకీయంగా కొందరు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ అధినేత్రి కవిత తీహార్ జైలులో చిప్పకూడు తిన్నదంటూ ఆయన ఎద్దేవా చేశారు. అలాంటి ఆవిడ సైతం పవన్‌ను ఉద్దేశించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ జాగృతి పేరుతో కోట్ల రూపయాల వసూలుకు పాల్పడిందని ఆరోపించారు. హిమాయత్‌నగర్‌లో బ్యూటీపార్లర్ నడిపింది నిజం కాదా అని కవితను ప్రశ్నించారు. కేటీఆర్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నోర్లు అదుపులో పెట్టుకోవాలన్నారు. నిజంగా పవన్‌కళ్యాణ్ చెరువును కబ్జా చేసి స్థలాన్ని కొనుగోలు చేసినట్లు రుజువైతే ప్రభుత్వానికి తిరిగి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పవన్‌కళ్యాణ్‌పై మాట్లాడుతూ రాజకీయ నేతలు తమ ఆస్తులను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గద్దర్ కుమార్తె వెన్నలకు పవన్‌కళ్యాణ్ గురించి బాగా తెలుసని అన్నారు. గద్దర్‌ను ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ వ్యతిరేకి అన్న విషయాన్ని వెన్నెల తెలుసుకోవాలన్నారు. గద్దర్‌ను రోడ్డుపై నిలబెట్టన కుటుంబం నీతులు మాట్లాడుతుందని వ్యాఖ్యానించారు. పవన్‌కళ్యాణ్‌ను అంటే తెలంగాణ బిడ్డలను అన్నట్లేనని, ఆయన పక్కన ఉన్న తామంతా తెలంగాణ బిడ్డలమే అన్నారు. సమావేశంలో పలువురు జనసేన నేతలు పాల్గొన్నారు.

### పోలీసు ఉద్యోగులకు ఆరోగ్య భద్రత నెలవారి చందా నిలిపివేత - జీఓను విడుదల చేసిన ప్రభుత్వం

### 'వార్త'కు స్పందన..

**జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్త:** పోలీసు ఆరోగ్యానికి.. 'రెండు కోతలు' పేరుతో వార్త పత్రికలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఆరోగ్య భద్రత కోసం నెవలవారి రుసుం సేకరణను నిలిపివేస్తున్నట్లు జీవోను విడుదల చేసింది. పోలీసు శాఖ ఉద్యోగుల వేతనాల నుంచి ఒకవైపు కొత్తగా అమల్లోకి వచ్చిన ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సిటి) కోసం 1.5 శాతం కోత విధిస్తుండగా, మరోవైపు ఆరోగ్య భద్రత పథకం పేరుతో నెలవారీ చందా వసూలు చేస్తుంది. ఈ క్రమంలోనే జూన్ నెలలో పోలీసు ఉద్యోగులను ఒకవైపు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం కింద డబ్బులు కత్తిరించగా, మరోవైపు ఆరోగ్య భద్రత కింద సైతం డబ్బులు కత్తిరించారు. ఈ అంశంపై వార్త కథనం ప్రచురితమైంది. దీనికితోడు ఉద్యోగులు, పోలీసు సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పోలీసు శాఖ అప్రమత్తమై వెంటనే స్పందించాయి. ఇప్పటికే ఈహెచ్‌సిటి పథకం కోసం ఉద్యోగుల ప్రాథమిక వేతనం నుంచి 1.5 శాతం మొత్తాన్ని మినహాయిస్తున్నందున, ఇకపై ఆరోగ్య భద్రత పథకం కింద వసూలు చేస్తున్న నెలవారీ చందాను నిలిపివేయాలని నిర్ణయించాయి. దీనికి సంబంధించిన ఉత్తర్వులను పోలీసు శాఖ విడుదల చేసింది. ఇప్పటి వరకు కానిస్టేబుల్ నుంచి సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు నెలకు రూ.300, ఇన్‌స్పెక్టర్, అంతకంటే పైస్థాయి అధికారుల నుంచి రూ.400 చొప్పున ఆరోగ్య భద్రత చందా వసూలు చేసేవారు. ఇకపై ఈ వసూళ్ల నిలిపివేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో పోలీసు ఉద్యోగులు, పెన్షనర్లపై అదనపు ఆర్థిక భారం తగ్గనున్నట్లు భావిస్తున్నారు.

## బోనాల జాతర పెండింగ్ పనులు పూర్తి చేయాలి



జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని సత్కరిస్తున్న మల్యాల మధుసూదన్ యాదవ్

**మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 6 ప్రభాతవార్త :** పాతబస్తీలో పూర్తి కాని గత సంవత్సరం బోనాల జాతర ఉత్సవాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరుతూ భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల కమిటి చైర్మన్ మల్యాల మధుసూధన్ యాదవ్ రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ఊరేగింపు కమిటి నూతన చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మల్యాల మధు సూధన్ యాదవ్ శనివారం రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. రాజేంద్రనగర్ జోన్ పరిధి చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర నియోజకవర్గాల పరిధిలోని దేవాలయాల వద్ద పెండింగ్‌లో ఉన్న గత సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జరగనున్న బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభానికి ముందే అభివృద్ధి పనులకు శ్రీ కారలం చుట్టాలని ఆయన కోరారు. జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో ఉమ్మడిదేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్, బుల్లేట్ శ్రీధర్, నాగరాజు ఉన్నారు.




శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ భగవద్గీత పద్య పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

## ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**సరూర్‌నగర్, జూన్ 6 ప్రభాతవార్త:**

ఆర్థిక ఇబ్బందులను భరించలేని ఓ ఆటో డ్రైవర్ జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక రాష్ట్ర బీదర్ ప్రాంతానికి చెందిన లాల్ అహ్మద్ (35) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి పహాడీషరీఫ్ సమీపంలోని షాజహాన్ కాలనీలో భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాడు. అయితే మొదట్లో సెంట్రింగ్ కార్మికునిగా ఉన్న అహ్మద్ ఆ తర్వాత ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే అప్పులు ఉన్న అతనికి వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో బాలాపూర్ పిఎస్ పరి ధిలోని నిర్మానుష్య ప్రదేశంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యపై అనుమానంతో హత్య ..భర్త అరెస్ట్

**దుండిగల్, జూన్ 6, ప్రభాతవార్త**

భార్యపై అనుమానంతో భర్త హత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా గాగిళ్లపూర్ చర్చి ప్రాంతానికి చెందిన అయ్యగారి సంతోష్ కుమార్ చారి (44) తన భార్య సంతోషి (38)కి 21 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న సంతోష్ కుమార్ చారి ఇతరులతో మాట్లాడుతుండటాన్ని అక్రమ సంబంధంగా భావించాడు. కాగా జూన్ 5న ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దుండిగల్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన దుండిగల్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

## పది రోజుల కస్టడీకి నేపాలి గ్యాంగ్ నిందితులు

**జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్త:**

మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే సతీమణి తనూజ రంజన్ హత్య, దోపిడి కేసులో అరెస్ట్ అయిన ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మే 8న జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే సతీమణి తనూజ రంజన్‌ను ఇంట్లో పనిచేసే నేపాల్‌కు చెందిన కల్పనతోపాటు మరో ముగ్గురు నేపాలి ముఠా కలిసి హత్య చేసి దోపిడికి పాల్పడిన విషయం విదితమే. ఈ కేసులో మొత్తం 9 మంది నిందితులు ఉండగా అందులో హత్యకు పాల్పడిన వారిలో ఒకరైన సునీల్ పరియార్‌తోపాటు ముంబైలో ఆభరణాలను కొనుగోలు చేసిన దిలీప్‌లను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితుల జాడ చిక్కకపోవడంతో పోలీసులు ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు వారిద్దరిని కస్టడీ కోరుతూ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలోనే కోర్టు పది రోజుల పాటు కస్టడికి అనుమతించడంతో నిందితులిద్దరిని జూబ్లీహిల్స్ ఠాణాకు తరలించి విచారిస్తున్నారు. సంఘటనకు ముందు వేసిన స్కెచ్ నుంచి మొదలుకొని సంఘటన జరిగిన తరువాత ఎవరు, ఎలా, ఎక్కడికి పారిపోయారు అనే అన్ని అంశాలపై ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో విచారిస్తున్నారు. ఈ కేసులో తప్పించుకున్న ప్రధాన నిందితుల జాడకు సంబంధించిన వివరాలను ప్రధానంగా సేకరిస్తున్నారు.

## రాష్ డ్రైవింగ్ చేసిన ఆటోడ్రైవర్‌పై కేసు

**చాంద్రాయణగుట్ట, జూన్ 6, ప్రభాతవార్త :** పరిమితికి మంచి ప్రయాణికులతో రాష్ డ్రైవింగ్ చేసిన ఒక ఆటోడ్రైవర్‌పై చాంద్రాయణగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ కావటంతో పోలీసులు అతనిపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట్ బిస్మిల్లా కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ అబ్దుల్ హమీద్ ఖాన్ (35) ఈనెల 4వ తేదీ రాత్రి తన ఆటో (టిఎస్13యు సి3818)లో పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించుకొని బార్కాస్ నుండి సాదత్ నగర్ వెళుతున్నాడు. ఆటోబయట ముగ్గురు యువకులు వేలాడుతుండగా మరో ఐదుగురు లోపల కూర్చున్నారు. మితి మీరన వేగంతో వెళుతున్న ఆటోపై వేలాడుతున్న యువకుల వీడియోలు సామాజిక మాధ్యమంలో వైరలైయ్యాయి. దీంతో పోలీసులు సుమోటో కేసుగా స్వీకరించి ఆటోడ్రైవర్ అబ్దుల్ హమీద్ ఖాన్‌పై 125 బిఎన్ఎస్ యాక్ట్, 184 ఎంవిఐ యాక్ట్ కింద ఈనెల5న కేసు నమోదు చేశారు. తాను తప్పు చేశా నని, తనాలా మరో ఆటోడ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికు లను ఎక్కించుకొని రాష్ డ్రైవింగ్ చేయవద్దని ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సైలు శ్రీనివాస్‌రావు, కిరణ్‌కుమార్ల సమక్షంలో వేడుకున్నాడు.




అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

## గ్రామాభివృద్ధి, పరిశుభ్రతపై అవగాహన

**కొమురవెల్లి, జూన్ 6,ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాంసాగర్‌లో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మీ మల్లారెడ్డి గ్రామ పరిశుభ్రత, తాగునీటి సంరక్షణ, పన్నుల చెల్లింపు, వర్షాకాలంలో కాలువల శుభ్రత తదితర అంశాలపై ప్రజలు అవగాహన కల్పించారు. ఎంపివో శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య,ఉపాధి, సమాజ సేవ లో ముందుండాలన్నారు. ఎపిఎం లింగం మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి వెంకటరామమ్మ మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చవద్దన్నారు. అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతోపాటు నేల సారవంతం తగ్గి పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. గ్రామానికి చెందిన తాడూరి హరిబాబు ఇండియన్ ఆర్మీకి సెలెక్ట్ కావడంతో సర్పంచ్,మండల అధికారుల చేతుల మీదుగా సత్కారించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింలు, కార్యదర్శి కరుణాకర్,ఏఈ మేఘన,ఉప సర్పంచ్.గ్రామ పంచాయతీ, ఐకెపి, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

### డిప్యూటీ తహసీల్దార్ మధుకర్

**చిన్నకోడూరు, జూన్ 6, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ మధుకర్ కోరారు. మండల పరిధిలోని ఎల్లాయిపల్లి, చెలుకలపల్లి, అల్లీపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్లాయిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాన్నారు.శుభ్రమైన తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు సిద్దుల రాజు, నాగార్జునరెడ్డి, కుంభాల మనమ్మ, రాజురెడ్డి, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎఎంసి వైస్ చైర్మన్ రాజశేఖర్‌కు సన్మానం



ఎఎంసి వైస్ చైర్మన్ రాజశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, జూన్ 6, ప్రభాతవార్త:** సామాజిక న్యాయం అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్‌సర్కార్ ముందుకు సాగుతుందని చిన్నకోడూరు ఎఎంసి వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్ అన్నారు. చిన్నకోడూరులో శనివారం టిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు, ముదిరాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఎఎంసి చైర్మన్ రాజశేఖర్‌ముదిరాజ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ ముదిరాజ్‌లకు సముచిత గుర్తింపు కల్పిస్తూ పెద్దపీట వేస్తుందన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తుందన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు చెరుకు పెద్దులు, కోరబోయిన సుధాకర్, ఇట్టబోయిన బాల పోచయ్య, కోరబోయిన శ్రీనివాస్, దశరథం, అంబటి కనకయ్య,కొత్త బాల రాజు, రవి, శరత్, బాబు, వికాస్, రోహిత్, చంద్రం, ఎల్లం, హరిబాబు, రవి, శ్రీనివాస్, రాజేష్, నరేష్, దత్తు,మహిపాల్, అరవింద్ పాల్గొన్నారు.

## పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన

**ములుగు, జూన్ 6 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ములుగు ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సిఆర్ఐ) ఆధ్వర్యం లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వినియోగంవల్ల ప్రకృతి,జీవవైవిధ్యంపై పడుతున్న ప్రభావాలను వివరించారు. రోజువారి జీవితంలో పర్యావరణానికి మేలు చేసే అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని, వ్యర్థాల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు పర్యావరణ పరిరక్షణ అంశంపై డిజిటల్ పోస్టర్ పోటీ నిర్వహించగా విద్యార్థులు వినూత్న ఆలోచనలతో పోస్టర్లను రూపొందించారు. ప్రకృతి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యాసంస్థల నుంచే పర్యావరణ చైతన్యం ప్రారంభం కావాలని కార్య క్రమంలో పేర్కొన్నారు.

## ధాన్యం నిల్వకు శ్రీలక్ష్మి మిల్ గోదాం అందుబాటులోకి

**బెజ్జంకి, జూన్ 6, ప్రభాతవార్త :** మండలంలోని కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యం లో రైతులకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టారు. ఈ సమస్యను మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. దీంతో తోటపల్లి పరిధిలోని శ్రీలక్ష్మి మిల్‌లో ఉన్న 25,000 క్వింటాళ్ల సామర్థ్యం గల గోదాంను ధాన్యం నిల్వ కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు. గోదాం ప్రారంభం కావడంతో కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని నిల్వచేయడానికి అవకాశం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం నిల్వ సమస్యకు తాత్కాలిక పరిష్కారం లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

### ఏబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవులపల్లి మహేందర్

**గజ్వేల్, జూన్ 6 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబివిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు దేవులపల్లి మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎబివిపి ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వపాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలని, అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని నియంత్రించాలని, అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో వసూలు చేస్తున్న ఫీజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి కార్యదర్శి గురు, నవీన్, చందు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవులపల్లి మహేందర్

# ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతు కనకయ్య బలి

### మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ నిర్లక్ష్యమే రైతు కనకయ్యను బలి తీసుకుంది మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటకు చెందిన రైతు పల్లెవేని కనకయ్య(గద్దర్) గుండెపోటు మృతి చెందగా శనివారం హరీష్‌రావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనకయ్య మృతి కాంగ్రెస్ సర్కార్...రేవంత్‌రెడ్డి హత్యేనని ఆరోపించారు. పండించిన పంటను 45 రోజులుగా కొనుగోలు చేయకపోవడంతో వర్షంలో వడ్లు తడవడంతో కనకయ్య ఆవేదనకు గురయ్యారని తెలిపారు. తడిచిన వడ్లు కొనాలని ప్రాధేయ పడితే 40 సంచులు కట్ చేశారని దీంతో కలత చెందిన కనకయ్య గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు.రైతులు పండించిన పంట కొనక రైతులను బలి తీసుకుంటున్నారని మండిపడ్డారు. రెండు నెలల నుంచి కొనుగోలు కేంద్రాలలో వడ్లు పోసుకొని ఎదురు చూస్తున్న రైతుల గోస కనబడడం లేదని సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.దుబ్బాక నియోజకవర్గం చేర్వాపూర్‌లో సంచులు ఎత్తకపోవడంతో చెదలు పట్టిన పరిస్థితి వచ్చిందన్నారు. మంత్రి రాజనర్సింహ నియోజకవర్గంలని వెంకటాపూర్‌లో నేటికీ ఒక్క క్వింటాళు కొనలేదన్నారు.మరణించిన కనకయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎలాంటి కోతలు లేకుండా వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు



బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చుతున్న హరీష్‌రావు

కాంగ్రెస్ సర్కార్ చేసింది ఏంటో ఒక్కటి చెప్పాలని సిఎంకు సవాల్ విసిరారు. ఎరువుల సరఫరాలో విఫలం...రైతుబందు ఇవ్వడంలో ఫెయిల్.. రైతులు చనిపోతే రైతు బీమా అందించడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నేను మళ్లీ గెలుస్తా...తొక్కుతా పండబెడతా తొండల బాష.. తొత్తిరి భాష మాట్లాడుతున్నారని మండిపడ్డారు.కనకయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. మాటలు కట్టిపెట్టి ఎలాంటి కోతలు లేకుండా యుద్ధప్రాతిపదికన వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో 8,577 మంది విద్యార్థుల నమోదు లక్ష్యం

### బడిబాట కార్యక్రమంపై జిల్లా విద్యాశాఖ సమీక్ష సమావేశం

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా టిటిఆర్‌సి భవనంలో జిల్లా విద్యాధికారి వి.శాస్త్రి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్‌పిలతో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో విద్యాశాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమం, విద్యార్థుల నమోదు, పాఠశాల పని తీరు సూచిక(పిజిఐ), యూడైస్ ప్లస్ 202627 డేటా నమోదు, పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫాంల పంపిణీ, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు,15 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాలో 81,329 మంది విద్యార్థులు ప్రభుత్వపాఠశాలల్లో నమోదు కాగా, ఈ ఏడాది 10 శాతం అదనంగా అంటే 8,577 మంది విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని లక్ష్యంగా నిర్ణయించి నట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు. సమావేశంలో ప్లానింగ్ కో ఆర్డినేటర్ పి.రామస్వామి, సీఎంఓ రంగనాథ్, జెండర్ కోఆర్డినేటర్ నర్మదా పాల్గొన్నారు.

## ఎన్‌ఎఫ్‌బిఎస్ దరఖాస్తులను ఎంపిడివో తీసుకోవాలి

### -డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

**గజ్వేల్ టౌన్, జూన్ 6 (ప్రభాతవార్త):** నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం (ఎన్‌ఎఫ్‌బిఎస్) దరఖాస్తు ఫారంలు తహసీల్దార్ కార్యాలయంలో ఇస్తే ఎంపిడివో కార్యాలయానికి పోవాలని, ఎంపిడివో కార్యాలయంలో ఇస్తే తహసీల్దార్ కార్యాలయంకు పోవాలని అధికారులు దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ యజమాని మరణించి కుటుంబ పోషణ భారమవుతున్న పరిస్థితుల్లో ఆ కుటుంబాలను ఆదుకోవడానికి ఇచ్చే ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అర్హులకు అందివ్వాలని, దరఖాస్తు చేసే క్రమంలో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు సరైన సమాచారాన్ని ఇచ్చే విధంగా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఏఒ ఎంపిడివో కార్యాలయంలోనే ఇవ్వాలని సూచించడం జరిగిందని తెలిపారు.

## తూతూ మంత్రంగా గ్రామసభలు

### సభలకు హాజరుకాని అన్ని శాఖల అధికారులు

**కొండపాక, జూన్ 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, గిరాయిపల్లి, కుకునూరుపల్లి మండల పరిధిలోని రాయవరం, పిటి వెంకటపూరం, ఎల్లాయిగూడ గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచుల అధ్యక్షతన సభలు నిర్వహించారు. సభల్లో పాలకవర్గం పలు తీర్మానాలను చేశారు. కాని సభలకు అన్ని శాఖల అధికారులు హజరు కాకపోవడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని అంటున్నారు. ముఖ్యంగా మరో వారం రోజుల్లో వర్షాకాలం మొదలు కానుండడంతో సాగునీటిపై, ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో తాగు నీరుపై, పిర్యాదు చేయడానికి సంబంధిత శాఖాల అధికారులు సభలకు హాజరుకాకపోవడంతో ఫలితం ఎమిటని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అన్ని శాఖల అధికారులు గ్రామసభలకు హాజరు కావాలని ఉత్తర్వులున్నప్పటికి వాటిని తుంగలోతొక్కి గైరజరవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని గ్రామ సభలకు అన్ని శాఖాల అధికారులు హజరయ్యేల చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**చిన్నశంకరంపేట, జూన్ 6,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాలయ్య తెలిపారు. శనివారం గజగట్లపల్లిలో గ్రామ ప్రత్యేక అధికారి వాసుదేవరావు ఆధ్వర్యంలో సర్పంచి నాగభూషణం అధ్యక్షతన ప్రజాపాలన-ప్రగతి పాలనలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. సభలో ఇరిగేషన్ డిఈ ధర్మ కుమార్ పాల్గొని పలు విషయాలపై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు గాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్,మధ్యాహ్న భోజనంతో పాటు ఈ విద్యా సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు 25 రకాల వస్తువులను అందిస్తారని తెలిపారు. తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐను కలిసిన ఎన్‌హెచ్ఆర్‌సి సభ్యులు

**చిన్నకోడూరు, జూన్ 6, ప్రభాతవార్త :** జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సి) సభ్యులు, ప్రతినిధులు శనివారం చిన్నకోడూరులో ఎస్సై చంద్రమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేవిధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నెమలి సుభాష్‌గౌడ్, ఉపాధ్యక్షులు ప్రభురాజ్, ఎర్రవెల్లి సంపత్, కార్తీక్ రెడ్డి, రాములు, సునీత, సుజాత, వెంకటలక్ష్మి, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

**చిన్నశంకరంపేట, జూన్ 6,ప్రభాతవార్త:** పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. శనివారం చిన్నశంకరంపేటలోని రాధే శ్యాం కళ్యాణ మండపంలో 115 మంది లబ్ధిదారులకు రూ.1,05,12,480 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రోహిత్‌రావు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోహన్‌నాయక్, సర్పంచి చంద్రశేఖర్, నాయకులు రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, గణేష్, తహసీల్దార్ మాలతి, ఆర్ఐ రాజు సర్పంచులు, పాల్గొన్నారు.

**నీటి ఎద్దడి నివారణకు బోరు వేయించిన ఎమ్మెల్యే...**

**చిన్నశంకరంపేట, జూన్ 6,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి తండా, మాందాపూర్, పాటిగడ్డ తండాలలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు దృష్టికి తిసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మైనంపల్లి సోషల్ సర్విస్ ద్వారా సోంత నిధులు రూ.6.50లక్షలతో ఏర్పాటు చేయించారు.గ్రామంలో నీరు పుష్కలంగా పడడంతో శనివారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి వాటిని ప్రారంభించారు. తమ గ్రామంలో మంచి నిటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేను గ్రామస్థులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిశుభ్రత అందరి బాధ్యత : సర్పంచ్

**మర్కుక్, జూన్ 6 (ప్రభాతవార్త):** పరిశుభ్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ పుట్ట రామరాజు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని గణేష్‌పల్లి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వానాకాలం దృష్టిలో పెట్టుకొని గ్రామంలో పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త బండిలో వేయాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో మహిళలు, యువత భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యమే మహా భాగ్యంగా భావించి ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. గ్రామంలో ప్రజల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలు, ఎంపివో అమీనాబేగం, కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు అక్కమ్మ, కవిత, స్వామి, కనకయ్య, సుమతి, నాగరాజు, అంగన్వాడీ టీచర్ కవిత, ఆశావర్కర్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ఎన్‌సిసి విద్యార్థుల ర్యాలీ

**సిద్దిపేట అర్బన్, జూన్ 6, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, పర్యావరణ మహోత్సవాన్ని పురస్కరించుకుని నాట్కో ఇందిరా నగర్ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో "ప్లాస్టిక్ వద్దు పేపర్ ముద్దు" అనే నినాదాలతో విద్యార్థులు పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, పర్యావరణ హిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సమన్వయకర్త రవీందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతల మాటల్లో తప్ప చేతల్లో చేయడం లేదు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :** కాంగ్రెస్ వాళ్లవి మాటల్లో తప్ప చేతల్లో ఏమీ లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయం లో శనివారం సామాజిక సేవకులు, ఎమ్మెల్సీ అమీర్‌ఖాన్ సహకారంతో తురక కాశా కులస్తులకు పనిముట్లను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు మోసమే జరుగుతుందన్నారు. రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెసోళ్లు 4 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పి కనీసం 1100 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. తురక కాశల్లకు రావాల్సిన 5 కోట్ల రూపాయలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ విషయంపై సంబంధితశాఖ మంత్రితో పాటు ప్రభుత్వ సెక్రటరీతో మాట్లాడి అసెంబ్లీలో గళమెత్తుతానని చెప్పారు. తురకకాశలు అధైర్య పడాల్సిన అవసరం లేదని రానున్నది కెసిఆర్ సర్కారేనని తెలిపారు. రూ. 5 కోట్ల నిధులను కెసిఆర్ ప్రభుత్వంలో రూ.50 కోట్లకు పెంచుతామన్నారు.మండుటెండల్లో బండరాళ్లను పగలకొడుతూ తురక కాశోళ్లు తమ జీవితాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. తురక కాశోళ్ల జీవితాల్లో వెలుగులు రావాల్సిన అవసరం ఉందన్నారు. బిఆర్ఎస్ పాలనలో ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. కాశ తురకల పిల్లలు బండరాళ్లలో కాదు పుస్తకాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్‌ఖాన్, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.




తురక కాశా కులస్తులకు పని ముట్లు పంపిణీ చేస్తున్న హరీష్‌రావు

**రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు...**

వచ్చే వానాకాలం సీజన్‌కు ముందస్తు చర్యలు తీసుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్ఈ ఇరిగేషన్, ఈఈ, డిఈలతో పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో నిర్మించే చంద్లాపూర్ లిఫ్ట్, సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ వద్ద నిర్మించే ఇర్కోడ్ లిఫ్ట్ పనుల్లో జాప్యం జరుగుతుందని పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గోలాపూర్ చెక్ డ్యామ్,కస్తూరిపల్లి చెక్ డ్యాం పనులు ఇంకా ప్రారంభం కాలేదని వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మిట్టపల్లి గుండ్ల చెరువుకి వెళ్లే బ్రిడ్జి పనులు,రాఘవాపూర్ ఇంద్రగూడెం పల్లె కుంట పనులు, ముండ్రాయి మెరుపుకుంట పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. నారాయణరావుపేట మండలం మల్కచెరువు వద్ద ఎల్ఎంసి ఆర్‌డిబిలోపలి నుంచి పైప్ లైన్ వేయాలని దీంతో కింద గ్రామాలకు నీరు అందుతుందన్నారు. చిన్నకోడూరు మండలం రంగాయిపల్లి ఎల్ఎంసి ఎల్ఎస్ఎం-1 కెనాల్ లైనింగ్ స్ట్రక్చర్స్ వెంటనే పూర్తి చేయాలన్నారు.పాలమాకుల ఊర చెరువకు బ్లాస్టింగ్ పనులు చేపట్టాలన్నారు. నియోజకవర్గం లో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సుధాకిరణ్, ఈఈలు వీరస్వామి, రమేష్ జాదవ్, శంకర్, సదయ్య, డిఈ, ఏఈలు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గాడిపల్లి భాస్కర్

## చెత్త సేకరణ పేరిట ప్రజలపై అదనపు భారం వేయొద్దు

**గజ్వేల్, జూన్ 6 (ప్రభాతవార్త):** మున్సిపల్‌లో ఇప్పటికే పన్నులు, నల్లా బిల్లులు, ఇతర సేవల ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై చెత్త సేకరణ పేరుతో మరో భారం మోపడం మంచిదికాదని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్‌లు విమర్శించారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణకు డబ్బులు వసూలు చేస్తామనడం పద్ధతి కాదని, చెత్త సేకరణను మున్సిపాలిటీయే భరించాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు చెత్త సేకరణను అప్పగిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, పేర్ల శ్రీనివాస్, నాయిని సందీప్, మద్దూరి నర్సింహ, వెంకట్‌రెడ్డి, నాగుముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, పిట్ల శ్రీనివాస్, మంద వెంకట్, హరికుమార్, జోడు ప్రకాష్, కొమ్ము చంద్రశేఖర్, ఆంజనేయులు, కాళ్ల సాయికుమార్, సందిరి రాజు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : కౌన్సిలర్

**గజ్వేల్, జూన్ 6 (ప్రభాతవార్త):** ప్రజాపాలన పట్టణ ప్రగతిలో భాగంగా శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో కౌన్సిలర్ నక్క సంతోష రాములుగౌడ్ ఆధ్వర్యంలో వార్డుసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నక్క సంతోషరాములుగౌడ్ మాట్లాడుతూ సంగుపల్లిలో అండర్ డ్రైనేజీ లేదని, మురికికాల్వలు సరిగా లేవని, వీటిని పరిష్కరించేందుకు మున్సిపల్ కమిషనర్ గణేష్ చొరవ చూపాలన్నారు. యుజిడి కనెక్షన్ ఇవ్వకపోవడంవల్ల దుర్వాసన వస్తుందని, మోరీలలో ఎత్తిన చెత్తను త్వరగా తొలగించాలని అధికారులను కోరారు. అలాగే వర్షం పడితే బురదమయం, నడవలేని స్థితిలో గల్లీ రోడ్లు ఉన్నాయని, సిసి రోడ్లు వేయించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వార్డులో ఉన్న సమస్యల గురించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన

**హుస్నాబాద్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం వరాహ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో ఆరుతడి విధానాన్ని అమలు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు సాగు ఖర్చులను నియంత్రించి, అధిక దిగుబడులు సాధించవచ్చని నిపుణులు రైతులకు వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని, వరి సాగులో నీటి నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతల వినియోగం ద్వారా రైతులు అధిక లాభాలు పొందే అవకాశాలపై అవగాహన కల్పించారు. రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు అందిస్తూ ఆరుతడి విధానాన్ని తమ పొలాల్లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొడేటి రమేష్, కూచనపల్లి మాజీ సర్పంచ్ మడప జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## పట్టణ పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి



కౌన్సిలర్‌తో కలిసి మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**హుస్నాబాద్ రూరల్, జూన్6, ప్రభాతవార్త:** పట్టణంలో శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2, 11, 13, 15, 18 వార్డులలో సంబంధిత కౌన్సిలర్ల అధ్యక్షతన వార్డుసభలు నిర్వహించారు. సభలకు మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్డు సభల అనంతరం రోడ్ల శుభ్రత, డ్రైనేజీల పరిశుభ్రత, మొక్కల నాటడం, దోమల నివారణ స్ప్రేయింగ్, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు సామూహిక పరిశుభ్రతకు బాధ్యత వహించాలని సూచించారు. ఇంటి చెత్తను నాలుగు రకాలుగా వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. వార్డులలో సమస్యలను ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి పురపాలక సంఘం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, పి. వరప్రసాద్, బొల్లి శ్రీనివాస్, ఆకుల రజిత, వాల సుప్రజనీన్‌రావు, మున్సిపల్ అధికారులతో పాటు తదితరులు ఉన్నారు.

## పేదలకు చీరెల పంపిణీ

**గజ్వేల్ టౌన్, జూన్ 6 (ప్రభాతవార్త):** పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయంవద్ద శనివారం పట్టణ కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు సిద్ది బిక్షపతి మాట్లాడుతూ పేదవారికి సేవ చేయడంలో ఉన్న తృప్తి మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దూబకుంట మైత్రాములు, మర్యాల లింగం, దూబకుంట లక్ష్మణ్, కైలాస శ్రీనివాస్, వీరేశం, మురళి తదితరులు పాల్గొన్నారు.

## అక్కన్నపేట మండలంలో గ్రామసభ

**అక్కన్నపేట, జూన్ 6, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు సర్పంచ్ జన్నారపు సంపత్ అధ్యక్షత వహించగా, స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో జయరాంనాయక్, జడ్పీ సీఈవో రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పలు ముఖ్య అంశా లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత త్రాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ - మన సంరక్షణ, మొక్కల పెంపకం - వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), వరద నీటి నిర్వహణ మరియు భద్రత వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా వివరించారు. గ్రామస్తులు తమ సమస్యలు, అవసరాలను గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతోపాటు గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహేష్, ఉపసర్పంచ్ శ్రీలేఖ మహేందర్, వార్డు సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారి సబియా, జీపీఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




అక్కన్నపేటలో గ్రామ సభ దృశ్యం



అరుణ్‌రాజ్ శేరికర్‌కు పార్టీ కండువా కప్పుతున్న కల్వకుంట్ల కవిత

## టిఆర్ఎస్‌లో చేరిన బిజెపి నాయకులు శేరికర్

సిర్గాపూర్, జూన్ 6, ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి పదవికి రాజీనామా చేసిన అరుణ్‌రాజ్ శేరికార్ శనివారం టిఆర్ఎస్ పార్టీలో చేరారు. టిఆర్ఎస్‌లో చేరిన అరుణ్‌రాజ్ శేరికార్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ ఖండువా కప్పి పార్టీకి సాదరంగా స్వాగతం పలికారు. అరుణ్‌రాజ్ శేరికర్ గతంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించిన విషయం పాఠకులకు విధితమే. టిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, తెలంగాణ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మార్చే దిశగా పార్టీ అడుగులు వేస్తున్నందున టిఆర్ఎస్ పార్టీలో తన అనుచరులతో చేరినట్లు అరుణ్‌రాజ్ శేరికర్ తెలిపారు.

## బీరప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజ



బీరప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

రామచంద్రాపురం, జూన్ 6, ప్రభాతవార్త: రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన బీరప్పస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఆలయ నిర్మాణ స్థలం విషయంలో వివాదాలకు ఆస్కారం లేకుండా బిహెచ్ఈఎల్ యాజమాన్యంతో చర్చిస్తామన్నారు.కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు తొంట అంజయ్య, బూరుగడ్డ పుష్పనగేష్, నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్, రాజు, కురుమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో వ్యవసాయ పొలాలకు రహదారి



సొంత నిధులతో పొలాలకు రహదారి వేయిస్తున్న సర్పంచ్

పుల్‌కల్, జూన్ 6, ప్రభాతవార్త: సర్పంచ్ చిరంజి లావణ్య కృష్ణారెడ్డి పొలాలకు వెళ్లేందుకు ఫార్మేషన్ రోడ్లు నిర్మాణానికి పంచాయతి ఎన్నికల్లో చేసిన హామీమేరకు సొంత నిధులను వెచ్చించి శనివారం రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా ఆయా కాలనీల్లో బోర్లు తవ్వించి సింగల్ ఫేజ్ మోటార్లను అమర్చి ప్రజలు దాహార్తి కొరకు అవస్థలు పడకుండా చేశారు. గ్రామానికి చెందిన ఆడపడుచుల వివాహాలకు అవసరమైన పుస్తె మెట్టెలకు నగదును అందచేస్తూ వస్తున్నారు. వ్యవ సాయ పొలాలకు వెళ్లేందుకు రైతులు పడుతున్న పాట్లను పరిష్కరించేందుకు ఫార్మేషన్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

## వాడివేడిగా గ్రామసభలు



కరస్‌గుత్తిలో నిర్వహిస్తున్న గ్రామ సభ

నాగల్‌గిద్ద, జూన్ 6, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం నిర్వహించిన వాడి వేడిగా కొనసాగాయి. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు అధికారులపై మండిపడ్డారు. కరస్‌గుత్తి కారాముంగి లకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమయిందని, ప్రయాణించేందుకు వాహన చోదకులు పడుతున్న పట్లు చెప్పనలవిగా ఉన్నాయని ప్రజలు మండి పడ్డారు. ప్రత్యామ్నాయ పంటలను సాగుకు రైతులు ముందుకు రావాలని వ్యవసాయ అధికారులు పిలుపునిచ్చారు.

## తప్పులులేకుండా జనగణన పూర్తిచేయాలి

### తహసీల్దార్ కిరణ్‌కుమార్

సిర్గాపూర్, జూన్ 6, ప్రభాతవార్త: మండలంలో జనగణన ప్రక్రియలో తప్పులు దొర్లకుండ పూర్తిచేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూపర్ వైజర్లకు సూచించారు. శనివారం సిర్గాపూర్‌లో సూపర్‌వైజర్లతో తహసీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 9 తారీఖు లోపు ఎలాంటి తప్పులు దొర్లకుండా ఇండ్ల గణన రికార్డులు పూర్తి చేయాలని ఆదేశించారు. డబుల్ ఎంట్రీలు లేకుండా ఏ ఒక్క ఇల్లు మిస్ కాకుండా మ్యాపులతో నివేదికలు సమర్పించాలని సూపర్‌వైజర్లకు తహసీల్దార్ సూచించారు.

## సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున్‌గౌడ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న టి.మల్లికార్జున్ గౌడ్‌ను సిద్దిపేట మున్సిపల్ కమిషనర్(ఎఫ్ఎసి)గా నియమిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ అఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టీ.కే.శ్రీదేవి శనివారం ఉత్త ర్వులు జారీచేశారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన సిద్ది అశ్రిత్‌కుమార్‌ను సస్పెండ్‌కావడంతో ఆయనస్థానంలో హుస్నాబాద్ కమిషనర్ టి.మల్లికార్జున్ గౌడ్‌ను ఎఫ్ఎసిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### మానవ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా రాజుచారి

సిద్దిపేట అర్బన్, జూన్ 6, ప్రభాతవార్త : మానవ హక్కుల పరిరక్షణ ఉమెన్ రైట్స్ కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామానికి చెందిన చెన్నోజి రాజు చారి మూడవసారి ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్య క్షుడిగా వరుసగా మూడోసారి అవకాశం కల్పించడం పట్ల రాజు చారి హర్షం వ్యక్తం చేశారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

# పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు



మాట్లాడుతున్న లావణ్య నాగరాజు

రామాయంపేట, జూన్ 6, ప్రభాతవార్త : పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం వైశ్యభవన్‌లో 10, 11, 12 వార్డులకు సంబంధించి వార్డుసభలను నిర్వహించారు. ఆయా వార్డు ప్రజల నుంచి పలు దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విడతల వారీ గా 12 వార్డులను అభివృద్ది చేస్తామన్నారు. సమ స్యలు ఎక్కువగా ఉన్న వార్డులను క్షేత్రస్థాయిలో సందర్శించి, అవసరమైన పనులను చేపడతామని తెలిపారు. ప్రతి వార్డులో కౌన్సిలర్ అందుబాటులో ఉంటున్నారని, అధికారుల సమన్వయంతో ఎప్పటి కప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా మన్నారు. పర్యావరణ పరిరక్షణలో బాగంగా ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. మున్సి పల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ మున్సిపా లిటీ పరిధిలో ప్లాస్టిక్ నిర్మూలను ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

### పబ్లిక్ మరుగుదొడ్లు తొలగించండి

#### 11వ వార్డు కౌన్సిలర్ దాకి శ్యామల స్వామి

11 వార్డులో పరిధిలో ఇళ్ల మధ్యలో ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని, వాటిని తొలగించాలని కౌన్సిలర్ దాకి శ్యామలస్వామి సభలో కోరారు. ప్రతి ఒక్కరు ఇళ్ల ల్లోనే వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాన్నారు. అలా నిర్మించుకునే వ్యక్తిగత మరుగుదొడ్లకు అవసర మయ్యే ఇటుకను ఉచితంగా సప్లై చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ వార్డులో పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీతగణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగ రాజు, రవినాయక్, బైరం స్వప్నకుమార్, దేవుని రంజిత్, మద్దెల మాధవి, దాకి శ్యామల స్వామి, మున్సిపల్ మేనేజర్ రఘువరణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వనిత, మెప్మా ఆర్పీలు మర్కు లావణ్య, రజిత, శ్రీలత(టిఎల్ఎఫ్ ఆర్పీ), కె.శ్రీలత, ఆర్. లావణ్య, కవిత, తరంగిణి, బాల్‌లక్ష్మి, నాయకులు పోచమ్మల గణేష్, దాకి స్వామి, చిలుక స్వామి, మద్దెల రమేష్, చింతల యాదగిరి పాల్గొన్నారు.



ప్రజలతో కలిసి గల్లిబాట నిర్వహిస్తున్న కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్

## పట్టణ పరిశుభ్రతకు గల్లీబాట

జహీరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త : మన గల్లీ మన బాధ్యత అనే నినాదం తో 27వ వార్డులో పరిసరాలను పరిశుభ్రం పరిచేందుకు ప్రజలతో కలిసి గల్లీబాట నిర్వహిస్తున్నారు.శనివారం సుభాష్‌గంజ్‌లో ప్రత్యేక అవగాహన కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నామ స్రవంతి మాట్లాడుతూ ప్రతి ఇల్లు ఎలాగైతే పరిశుభ్రంగా ఉంటుందో, గల్లీలను అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వార్డులో నివసిస్తున్న ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు, ఆమె స్థానిక మహిళలతో కలిసి వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు తమ ఇళ్ల నుంచి వెలువడే చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా, మున్సిపాలిటీకి చెందిన చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలని ఆమె ప్రజలను కోరారు. .ఈ కార్యక్రమంలో జవాన్ శ్రీధర్, రిసోర్స్ పర్సన్ లక్ష్మి ్మ, స్వయం సహాయక సంఘం సభ్యులు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

సదాశివపేట, జూన్ 6 ప్రభాతవార్త: మండలంలోని నిజాంపూర్ గ్రామంలో చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆడెం బ్రదర్స్ తెలి పారు. గ్రామంలోని లోపలి కోట హనుమాన్ మందిరం వద్ద మృగశిర కార్తె ప్రారంభం కాగానే సాయంత్రం 8 గంటలకు చేప ప్రసాదం ఉచితంగా అంద జేయనున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం నిజాంపూర్‌లో చేప మందు కోసం మెదక్, సిద్దిపేట్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, నల్గొండ తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీసంఖ్యలో హాజరవుతారని తెలిపారు. చేప ప్రసాదం ఆస్తమా, ఉబ్బసం, దగ్గు, ఎలర్జీ నివారణ కోసం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. వివరాలకు 9396880163, 9652424833, 7288866624 సెల్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## నామమాత్రంగా గ్రామసభలు

మొగుడంపల్లి, జూన్ 6 (ప్రభాతవార్త): మండలంలోని పడియాల తండా, గోపనపల్లి, సున్నంపట్టి తండా, మన్నాపూర్, మద్గి గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు నామమాత్రంగా జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్వహించా ల్సిన గ్రామసభలు కేవలం తంతుగా మారిపోయాయని వారు ఆరోపించారు. గ్రామసభలకు సంబంధిత ఉన్నతాధికారులు హాజరుకాకుండా కేవలం కిందిస్థాయి సిబ్బందితోనే కార్యక్రమాలను ముగిస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు, రహదారుల దుస్థితి, పారిశుధ్య సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చ జరగాల్సి ఉండగా, వాటిని పక్కనపెట్టి ఫోటోలు తీసుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు.సభల్లో ప్రజలు వినిపిస్తున్న సమస్యలకు సరైన స్పందన లేకపోవడంతో గ్రామసభలపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు కీలక వేదికలుగా ఉండాలని, ఉన్నతాధికారులు స్వయంగా హాజరై ప్రజల సమస్యలు తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పోలీసుల అదుపులో గొలుసు దొంగల అరెస్టు

న్యాల్‌కల్, జూన్ 6, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ముంగి, బసంత్‌పూర్ గ్రామాల శివారులోని వ్యవసాయ భూముల వద్ద ఉన్న మహిళల మెడలోంచి బంగారు ఆభరణాలను దోచుకుపోయిన ఇద్దరు నిందితులను హద్నూర్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మండల పరిధిలోని హద్నూర్ పోలీసు ఠాణాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్‌పి సైదా నాయక్, జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు, హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్‌లు ఇందుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... శనివారం మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా ఇద్దరు మహిళల నుంచి 2 తలాల బంగారం ఆభరణాలను దోచుకున్నట్లు ఒప్పుకున్నారన్నారు. నిందితుల వద్ద నుంచి 1.5 తులం బంగారం, 15వేల నగదును నేరానికి ఉపయోగించిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని, ఇద్దరి వద్ద నుంచి సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. చైన్ స్నాచర్‌లను పట్టుకోవడంతో చొరవ చూపిన పోలీసు సిబ్బంది ఆనంద్, ఓందేవ్, రవి, మహేష్‌లను డిఎస్‌పి పత్యేకంగా అభినందించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు.

## ధాన్యం తరలింపులో జాప్యంపై రైతుల రాస్తారోకో

కొల్చారం, జూన్ 6 ప్రభాతవార్త: కొల్చారం మండలం చిన్నగణపురం గ్రామ రైతులు ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ శనివారం మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంత రాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అనం తరం తహసీల్దార్ శ్రీనివాస్‌చారితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. ధాన్యం తరలింపునకు వెంటనే చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మంద నాగయ్య మాట్లాడుతూ, ధాన్యం తరలింపులో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శిం చారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభ



గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

కొల్చారం, జూన్ 6 (ప్రభాతవార్త): మండల పరిధిలోని రంగంపేట గ్రామం లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం గ్రామసభను నిర్వహిం చారు. సర్పంచ్ అరిగే స్వర్ణలత విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని అభివృద్ధికి సంబంధించిన నివేదికలను సభ ముందుంచి వివరించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, వర్షాకాలంలో చేపట్టాల్సిన పారిశుధ్య, తాగునీరు, డ్రైనేజీ తదితర పనులపై గ్రామస్తులతో కలిసి చర్చించారు. ప్రజల సూచనలు, అభిప్రాయా లను అధికారులు స్వీకరించారు.అంతకుముందు గ్రామపంచాయతీ వాటర్‌మెన్ కొనకంటి వెంకట్ మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు, ఉపసర్పంచ్ చిట్కుల సురేష్, పశు వైద్యాధికారి ప్రియాంక, వార్డు సభ్యులు మమత, వెంకట్ గౌడ్, నాయకులు ఉసికె రాజు, సుధాకర్, పడేపు వెంకటేశం, సాంబ సత్యనారాయణ, మల్లేశం, రమేష్, అల్లి చందు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మొగుడంపల్లిలో ఉపాధి హామీ పనుల పరిశీలన

మొగుడంపల్లి, జూన్ 6 (ప్రభాత వార్త): మొగుడంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొన సాగుతున్న పనులను సర్పంచ్ శనివారం పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా పనుల్లో పాల్గొంటున్న కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, హాజరు నమోదు, పనుల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. ఉపాధి హామీ పనులను నిబంధనల మేరకు, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ చేపట్టాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు.గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొని పనుల స్థలాన్ని సందర్శించారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

# నల్లకుంట చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తా

### మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్





మాట్లాడుతున చైర్మన్ చిన్నపావని కుమార్‌గౌడ్

గుమ్మడిదల, జూన్ 6, ప్రభాతవార్త : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పాలన అందిస్తూ గుమ్మడిదల మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంత మైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తు న్నామని మున్సిపల్ చైర్మన్ చిన్నపావని కుమార్ గౌడ్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం దోమడుగులోని 3, 9,18, 19 వార్డులకు సంబంధించిన వార్డుసభ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో, చైర్మన్ చిన్నపావని కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రజలు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాలు, అంతర్గత రహదారులు, మౌలిక సదుపాయాల కొరత వంటి అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలను కూడా అధికారులు పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ చిన్నపావని కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, వార్డు సభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వేదికలుగా నిలు స్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల సూచనలు, అబి .ప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రజలు ప్రస్తావించిన సమస్య లను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, ప్రతి వార్డులో అభివృద్ధిఫలాలు చేరేలా చర్యలు చేపడతా మని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో మౌలిక వసతుల విస్తరణతోపాటు సంక్షేమ పథకాల అమ లుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన తెలి పారు. గ్రామంలోని నల్లకుంట చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలోనే పనులు ప్రారంభించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రజల సహకారం, అధికారుల సమన్వయంతో గుమ్మడిదల మున్సిపాలిటీని అభివృద్ధి, పారిశుద్ధం, సౌకర్యాల పరంగా ఆదర్శంగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు సోనీ, వరలక్ష్మి ్మ, రాజశేఖర్, రాజిరెడ్డి, వివిధ శాఖల అధికా రులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయ కులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువ కులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తప్పుడు పత్రాలు సృష్టించినవారిపై చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్‌కు హత్నూర గ్రామస్థుల ఫిర్యాదు

హత్నూర జూన్ 6 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని అల్వా చెరువు మట్టి తవ్వకాలలో తప్పుడు పత్రాలు సృష్టించిన బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు హత్నూర గ్రామస్తులు తెలిపారు. గ్రామసభ పెట్టకపోయినా పెట్టినట్లు, బహిరంగ వేలం వేయకపోయినా వేసినట్లు తీర్మానాలు సృష్టించి, అక్రమ పద్ధతిలో మట్టి తవ్వకాలకు సంబంధిత అధికారులకు అనుమతులకు దరఖాస్తు చేసుకున్నారని, అలాంటి దరఖాస్తులకు అనుమతులు ఇవ్వకుండా, తగిన చర్యలు తీసుకోవడంతోపాటు, బాధ్యులైన ప్రజాప్రతినిధులు అధికరులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాల అందచేత

మనూర్, జూన్ 6, ప్రభాతవార్త: మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శనివారం మనూర్‌లోని మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి రాజశేఖర్ శెట్కార్ అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమం లో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సంతోష్‌కుమార్‌జోషి, సీఆర్‌పి రాజు, కంప్యూ టర్ ఆపరేటర్ మాణిక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

మనూర్, జూన్ 6, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని భక్తులకు గ్రామానికి చెందిన బిరదర్ జగదేవి సంగప్పల సహకారంతో అన్నదాన వితరణ కార్య క్రమం నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో ప్రతి శనివారం భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గ్రామానికి చెందిన జగదేవి, సంగప్ప దంపతులు అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. అన్నదానం చేసిన దంపతులకు గ్రామస్థులు శాలువా కప్పి భగవద్గీతను బహుకరించారు.

## కోహెడకు తరలివెళ్లిన రైతులు

సిర్గాపూర్, జూన్ 6, ప్రభాతవార్త: కోహెడలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణ శంకుస్థాపనకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి రైతులు, అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో తరలివెళ్లారు. కోహెడ్‌కు తరలివెళుతున్న బస్సును మండల విద్యాధికారి హరికృష్ణ, కడపల్ సొసైటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, సిర్గాపూర్ సర్పంచ్ శ్రీని వాసరావు పాటిల్‌లు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతరావు, రైతులు విఠల్‌రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.

## కూచారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

మనోహరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త : మండలంలోని కూచారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న బాలికలకు హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఫౌండర్ రవీందర్, హెచ్‌సిజి గ్రూప్ సభ్యుల సహకారంతో బిఆర్ఎస్ నాయకులు నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్ సైకిళ్లను అందజేశారు. ఈ సంద ర్భంగా నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్ మాట్లాడుతూ కూచారం జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థుల్లో పాఠశాలకు సరిగా రావట్లేదని మా దృష్టికి రాగా, వెంటనే హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూపు ఫౌండర్ రవీందర్‌కు ఈ విషయాన్ని తెలియపరచగా ఎవరైతే విద్యార్థులు 90శాతం పైన హాజరు నమోదు చేసి, మంచిగా చదువుతారో మొదటగా ఎంపిక చేసిన పదిమందికి సైకిళ్లను ఇస్తామని ప్రకటించారని తెలియజేశారు. వారిచ్చిన మాట ప్రకారం ప్రపంచ సైకిళ్ల దినోత్సవం సందర్భంగా 10 సైకిళ్లను విద్యార్థినులకు అంద జేశారు. దీనికి సహకరించిన హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఫౌండర్ రవీందర్ కు, గ్రూప్‌సభ్యులకు, ప్రధానోపాధ్యాయురాలు సవితకి, ఉపాధ్యాయులకు, ఉదయ్ రంజన్ గౌడ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ సభ్యులు భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

## విజయవంతంగా వృద్ధుడికి మోకాళ్ల చిప్పల మార్పిడి

రామచంద్రాపురం, జూన్ 6, ప్రభాతవార్త: మోకాళ్ల నొప్పితో మంచానికే పరిమితమైన 75 వృద్ధుడికి మోకాళ్ల చిప్పలు మార్పిడి చేశామని, అతడు సునాయాసంగా నడవడం, మెట్లు ఎక్కడం, దిగడం చేస్తున్నాడని రామ చంద్రాపురంలోని అశోక్‌నగర్‌గల మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. శనివారం ఆసుపత్రిలో వైద్యులు డాక్టర్ శివర్ధన్ మాట్లాడుతూ హైదరా బాద్‌కు చెందిన రాఘవేంద్ర కొన్ని సంవత్సరాలుగా రెండు మోకాళ్ల నొప్పి తో(ఆస్టియో ఆర్థరైటిస్) అవస్థలు పడుతూ మంచానికే పరిమితమయ్యాడ న్నారు. చికిత్సనిమిత్తం మెడికవర్ ఆసుపత్రికి చేరుకోగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శివర్ధన్ నేతృత్వంలో డాక్టర్లు రెండు మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్స చేసి మొదటి రోజే పూర్తి బరువుతో నడిపించామన్నారు. ప్రత్యేక ఫిజియోథెరపి, పునరావాస చికిత్సతో త్వరగా కొలుకునేలా చికిత్సలు అందచేసి నెల రోజుల్లోనే ఎలాంటి పరికరాలు, ఎవరి సహాయ సహకారాలు లేకుండా నిడవడం, మెట్లు ఎక్కడం, దిగడం చేస్తున్నారని డాక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. మోకాళ్ల నొప్పిని వయసు సహజ లక్షణంగా భావించకుండా సరైన సమయంలో ఆర్థోపెడిక్ నిపుణులను సంప్రదించి చికిత్సలు అందుకుంటే సునాయసంగా 16 ఏండ్ల కుర్రాడిలా నడవవచ్చొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు వద్దు...ప్రభుత్వ పాఠశాలలే ముద్దు : ఎంఇవో

న్యాల్‌కల్, జూన్ 6, ప్రభాతవార్త: ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశా లల్లో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని మండల విద్యాధికారి మారుతిరాథోడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని డప్పూర్ గ్రామం లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా డప్పూర్ గ్రామంలో నిర్వ హించిన గ్రామసభ(బడిబాట)లో ఎంఈఓ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాపరమైన సౌకర్యాలు అందిస్తూ నాణ్యమైన విద్యను అందచేస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదాంబ, ఉప సర్పంచ్ మన్నెల్లి నాగమ్మ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిరణ్‌గౌడ్, పంచాయితీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

### సర్పంచ్, డిఎస్‌పి

జహీరాబాద్ జూన్ 6 ప్రభాతవార్త : గామాలలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఉగ్గిలి సర్పంచ్ పట్ల విముల శ్రీని వాస్‌రెడ్డి, అన్నారు. శనివారం మండలంలోని హుగ్గెల్లిలో నిర్వహించిన ప్రజాపాలన..ప్రగతి ప్రణా ళిక గ్రామ సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, డిఎస్పీ సైదా,ఎస్ఐ కాశీనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వక్తలు పేర్కొన్నారు. డిఎస్‌పి సైదానాయక్, ఎంపీ డీవో పి.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామసభలే ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఉత్తమ వేదికలని విద్య, వైద్యం పారిశుధ్యంవంటిరంగాల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని వారు స్పష్టం చేశారు. ముఖ్యంగా రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, అంటువ్యాధుల నివారణకు ప్రతి కుటుంబం తడిపొడి చెత్తను వేరుగా సేకరించాలని, గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెం ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రైతులకు పంట మార్పిడి విధానాలు, వ్యవసాయశాఖ సూచించే శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రు లను కోరారు. అలాగే, ఓటరు జాబితా సవరణలో అర్హులైన ప్రతిఒక్కరూ పేరు నమోదు చేసుకోవాలని, మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన షీటీమ్స్ సేవలను ఆపదసమయం లో వినియోగించుకోవాలని డిఎస్పీ సైదా సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.





ఉగ్గేల్లి గ్రామసభలో మాట్లాడుతున్న డిఎస్పి సైదానాయక్